

22 ఆలయాల ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

కర్నూలు అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 22 దేవాలయాలకు సంబంధించిన ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 6న నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. ఆరోజు నుంచి 20 రోజుల్లోపు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మిగనూరు మండలం గుడేకల్లు వద్ద అసంపూర్తిగా టీబీపీ ఎల్లెల్సీ లైనింగ్ పనులు



ఇవేం కాలువలు?

ఆయకట్టుకు పంట కాలువలు జలనాడులు. చివరి ఆయకట్టుకు సాగునీరు అందాలంటే కాలువలు బాగుండాలి. అయితే గత వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా కాలువలు దెబ్బతిన్నాయి. డిస్ట్రిబ్యూటర్లు శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రధాన కాలువలు పూడికతో నిండిపోతున్నాయి. సాగునీరు అందని దైన్యస్థితికి చేరాయి. కూటమి ప్రభుత్వం రావడంతో కాల్వల మరమ్మతులపై రైతుల్లో ఆశలు చిగురించాయి. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అత్యవసర పనులకు తక్షణమే రూ.41.38 కోట్లు నిధులు ఇవ్వాలని జలవనరుల శాఖ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నిధులిస్తే కాలువలు కొంతైనా బాగుపడుతాయి. లేదంటే పంట చేలు తడిపేందుకు అన్నదాతలకు 'కన్నీటి' కష్టాలు తప్పవు.

- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంపై రైతుల్లో ఆశలు
- అత్యవసర పనులకు రూ.41.38 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులిస్తేనే కాలువలు బాగుపడేది

కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), గాజులదిన్నె ప్రాజెక్టు, కర్నూలు-కడప (కేసీ) కాలువ, తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం కుడిగట్టు కాలువ (ఎస్సార్బీసీ) పరిధిలో 5.05 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందిచాల్సి ఉంది. పంట చేలకు జలనాడులైన కాలువలు పూర్తిగా అధ్వానంగా మారాయి. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు నిధులతో మరమ్మతులు చేపట్టారు. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ఐదేళ్ల పాటు కాలువలు, ప్రాజెక్టు నిర్వహణపై అంతులేని నిర్లక్ష్యాన్ని చూపింది. దీంతో కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు శిథిలావస్థకు చేరాయి. పలు ప్రాంతాల్లో పూడిక, ముళ్ల పొదలతో నిండిపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ వేసవిలో డిస్ట్రిబ్యూటరీలు, కాలువలు మరమ్మతులు చేపడితే జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్‌లో ఆయకట్టుకు సాఫీగా సాగునీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆశిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

ఉమ్మడి జిల్లాల్లో కేసీ కాలువ, ఎస్ఆర్‌బీసీ, టీబీపీ ఎల్లెల్సీ, తెలుగుగంగ కాలువలు సహా మైనర్ ఇరిగేషన్ పరిధిలో అత్యవసరంగా చేపట్టాల్సిన 547 మరమ్మతు పనులకు రూ.41.38 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే పనులు చేపడుతాం. వచ్చే ఖరీఫ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం.

- కబీర్‌బాషా, చీఫ్ ఇంజనీరు, ఉమ్మడి జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, కర్నూలు



కోసిగి మండలంలో ముళ్ల పొదలతో నిండిపోయిన ఎల్లెల్సీ మాధవరం మేజర్ కెనాల్

రూ.41.38 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మైనర్ ఇగిరిగేషన్ పర్యవేక్షణలోని చెరువులు, తూములు, కాలువలు సహా టీబీపీ ఎల్లెల్సీ, ఎస్ఆర్‌బీసీ, తెలుగుగంగ ప్రాజెక్టు, కేసీ కెనాల్, గురురాఘవేంద్ర ప్రాజెక్టు పరిధిలోని పంటల కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, తూముల అత్యవసర మరమ్మతుల కోసం రూ.41.38 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జలవనరుల శాఖ ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపారు. వాస్తవంగా పూర్థిస్థాయిలో మరమ్మతులకు రూ.1,558 కోట్లు అవసరం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు. ఆ మొత్తంలో ప్రభుత్వం నిధులు ఇవ్వడం సాధ్యం కాని పరిస్థితి ఉంది. దీంతో ఖరీఫ్ సీజన్‌లో ఏ ఇబ్బంది లేకుండా సాగునీరు ఇవ్వాలంటే 547 పనులకు రూ.41.38 కోట్లు ఇవ్వాల్సిన అత్యవసరం ఉందని ఇంజనీర్లు అంటున్నారు. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని కాలువల మరమ్మతులపై దృష్టి సారించాలి. ఆ దిశగా జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయనపై ఒత్తిడి తీసుకురావాల్సి అవసరం ఉంది.

ప్రాజెక్టు వారిగా ఆయకట్టు (లక్షల ఎకరాల్లో), అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు. రూ.కోట్లల్లో

సాగునీటి కాలువ	ఆయకట్టు	పనులు	కావాల్సిన నిధులు
మైనర్ ఇరిగేషన్, కర్నూలు	--	24	1.39
మైనర్ ఇరిగేషన్, నంద్యాల	--	49	2.68
టీబీపీ ఎల్లెల్సీ	1.51	110	8.53
కేసీ కాలువ	1.75	221	15.00
తెలుగుగంగా కాలువ	1.24	67	8.20
ఎస్సార్బీసీ కాలువ	1.55	64	4.84
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	--	12	0.74
మొత్తం	5.05	547	41.38



గాజులదిన్నె ప్రాజెక్టు కుడి కాలువ దుస్థితి

వాస్తవ పరిస్థితులివీ..

- తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) ద్వారా ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు పట్టణాలు సహా 195 గ్రామాలకు తాగునీరు అందించాలి. 1955లో నిర్మించిన ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ, పంట కాలువలు అధ్వానంగా మారాయి. పలు ప్రాంతాల్లో ఆనవాళ్లు కోల్పోయాయి. పూర్థిస్తాయిలో మరమ్మతులు, పునర్నిర్మాణం చేయాలంటే రూ.350 కోట్లు అవసరం ఉంది. అత్యవసరమైన 110 పనులకు రూ.8.54 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదన పంపారు.
- కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరం, నంద్యాల, నందికొట్కూరు పట్టణాలు, వివిధ గ్రామాలకు తాగునీరు అందించే కేసీ కాలువ అధ్వానస్థితికి చేరింది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో 'సిప్' కింద రూ.563 కోట్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు ఇవ్వాడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే.. 85 శాతం నిధులు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) ఇస్తే.. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన 15 శాతం వాటా గత వైసీపీ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో నిధులు ఆగిపోయాయి. తక్షణ మరమ్మతులకు 221 పనులకు రూ.15 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు.
- నంద్యాల జిల్లాలో 1.90 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఎస్సార్బీసీ కాలువ అసంపూర్తి వల్ల 1.55 లక్షల ఎకరాలకే ఆయకట్టు స్థిరీకరించారు. బనగానపల్లె, పాణ్యం నియోజకవర్గాల్లో సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందించే ఈ కాలువ మరమ్మతులు, అసంపూర్తి పనులు కోసం రూ.270-300 కోట్లు కావలని ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. అయితే అత్యవసర మరమ్మతులకు 64 పనులకు 4.84 కోట్లు ఇవ్వాలని ఇంజనీర్లు కోరుతున్నారు.
- తెలుగుగంగా కాలువ ద్వారా ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో 1.24 లక్షల ఎకరాలకు సాగునీరు, ఆత్మకూరు, నంద్యాల, వెలుగోడు, ఆళ్లగడ్డ పట్టణాలు సహా పలు గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఇప్పటికే 40 కి.మీలు లైనింగ్ పనులు చేశారు. మరో 45-50 కి.మీలు లైనింగ్, పంట కాలువలు ఆధునీకరణ కోసం దాదాపు రూ.250 కోట్లకు పైగా అవసరం ఉందని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇవ్వాలంటే తాత్కాలిక మరమ్మతుల కోసం 67 పనులకు రూ.8.19 కోట్లు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపారు.

ప్రారంభమైన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మొదటి రోజు 241 మంది విద్యార్థుల గైర్హాజరు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 21,393 మంది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు నమోదు చేసుకున్నారు. దీంతో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకు ప్రథమ సంవత్సరం, 2:30 నుంచి రూ.5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొదటి రోజున 3,842 మంది విద్యార్థులకు గానూ 3,660 మంది పరీక్షకు హాజరు కాగా, 182 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 660 మంది విద్యార్థులకు గానూ 601 మంది హాజరు కాగా, 59 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు జి.లాలెప్ప, సురేష్ చంద్ర, పద్మావతితో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు. మొదటి రోజు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులతో ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను గేటు బయటనే చెకింగ్ చేసి లోపలికి అనుమతించారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.



పథకం ప్రకారమే హత్య?

- గడివేముల ఘటనలో రోజుకో ట్విస్ట్
- వివాహేతర సంబంధమే హత్యకు దారి?



పొలంలో నిప్పు పెట్టిన అనుమానిత స్థలం

నంద్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మానవ అస్తిపంజరంలోని కొన్ని ఎముకలు, లభ్యమైన ఆనవాళ్లతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వరుస కథనాలతో ఓ కేసు మిస్టరీ వీడుతోంది. గత నాలుగు రోజులుగా 'పోలీస్.. ఇదేం తీరు..' 'మిస్టరీ వీడేనా..' కథనాలు పోలీస్ శాఖను కుదిపేసింది. ఈ కథనాలపై జిల్లా పోలీస్ బాస్ తమదైన శైలిలో స్పందించి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ నేతృత్వంలో సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డిలు తదితర సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి మూడు రోజులుగా దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ దర్యాప్తులో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి రావడంతో ఈ కేసు మరింత ఉత్కంఠ రేపుతోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. పథకం ప్రకారమే హత్య జరిగినట్లు స్పష్టమైంది. అయితే హత్య అనంతరం విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. హత్య చేసి గుర్తు పట్టకుండా శరీరంపై యాసిడ్, పెట్రోల్ పోసి దహనం చేశారు. ఆ తర్వాత మిగిలిన అస్తిపంజరంలోంచి చిన్న ఎముకలను విసిరేసి.. పెద్ద ఎముకలను పిండి చేసి అక్కడక్కడ పడేశారని సమాచారం. మొత్తంగా వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు మొదట్లోనే కేసు నమోదు చేయకుండా జాప్యం చేయడం, ఆనవాళ్లను పోలీసులే మాయం చేసిశారంటూ స్థానికంగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొద్దిగా లభ్యమైన ఆనవాళ్లతో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో పోలీసులు ఈ కేసును సీరియస్‌గా తీసుకోవడం హాట్ టాపిగా మారింది.

హత్యలో పక్కా స్కెచ్?

గడివేముల మండలానికి చెందిన ఓ గొర్రెల కాపరి కొన్నేళ్లుగా తాగుడికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో భార్య, పిల్లలు కూడా సదరు కాపరిని వదిలేశారు. దీంతో అక్కడక్కడ గొర్రెల కాపరిగా వెళ్తూ.. వచ్చే కూలీ డబ్బుతో వ్యసనాలు తీర్చుకునేవారు. ఆ గొర్రెల కాపరి గత నెల 23వ తేది నుంచి తన సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అయినట్లు గుర్తించారు. దీంతో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని నెలలుగా అదే మండలానికి చెందిన ఓ గొర్రెల యజమానికి వద్ద గొర్రెల కాపరిగా కూలీకి చేరాడు.

మిగతా 7వ పేజీలో



రక్తపు మరకలతో ఉన్న దుస్తులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి రీ ఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి కర్నూలు ఆర్డీవో వద్ద 23, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 23, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, సర్వే ఏడీ వద్ద 2, వ్యవసాయశాఖ, డీఆర్‌డీఏ పీడీ, డ్వామా పీడీల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటిని బియాండ్ ఎస్ఎల్‌ఏలో వెళ్లకుండా పరిష్కరించాలన్నారు.

'కౌలు రైతులను గుర్తించాలి'

గ్రామ సభల ద్వారా అర్హులైన కౌలు రైతులను గుర్తించాలని ఇన్‌చార్జి కలెక్టర్ జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లకు సూచించారు. 25వేల సీసీఆర్‌సీ కార్డుల జారీ చేయాలని జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగానే అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్‌సీ కార్డులు ఇప్పిస్తే వారు ప్రైవేటు వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకోకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసుకునేందుకు షెడ్యూల్‌ను తయారు చేసుకోవాలని, అదేవిధంగా గ్రామ సభలు ఎప్పుడు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ప్రజలకు ముందుగానే తెలియజేయాలని సూచించారు. దేవదాయశాఖ, వక్ఫ్‌శాఖల అధికారులు కూడా ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య

బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో గత ఫిబ్రవరి నిర్వహించిన బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ 1,2,3,4 సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ప్రొఫెసర్ వెంకట బసవరావు విడుదల చేశారు. ఈ పరీక్షల్లో రీవాల్యూయేషన్ కోసం ఈనెల 22 లోపు తగిన రుసుం చెల్లించి కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకటో సెమిస్టర్‌లో 155 మంది విద్యార్థులకు గానూ 108 మంది, రెండో సెమిస్టర్‌లో 47కు 34 మంది, మూడో సెమిస్టర్‌లో 76కు 43 మంది, నాలుగో సెమిస్టర్‌లో 72 మంది పరీక్షలు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

డిగ్రీ పరీక్షలో మాస్ కాపీయింగ్

కర్నూలు అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 4వ సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థి డిబార్ అయినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలులోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో డిబార్ అయినట్లు తెలిపారు. డిగ్రీ పరీక్షలకు 8,537 మంది విద్యార్థులకు గానూ 7,773 మంది హాజరయ్యారు. బీఈడీ 3వ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి 4,015 మంది దరఖాస్తు చేసుకోగా 3,697 మంది హాజరయ్యారని తెలిపారు. డోన్ పట్టణంలోని జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్ పాల్పడిన బీఈడీ విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

19 నుంచి 'పది' అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయని డీఈవో శామ్యూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు కొనసాగుతాయని చెప్పారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటల నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ద్వారా అభ్యర్థులు 9552300009 నెంబరుకు హాయ్ అని సందేశం పంపి, విద్యాసేవలు ఎంచుకోవడం ద్వారా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

వేరుశనగ ధర పతనం



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ ధరలు రోజు రోజుకి మరింత పతనమవుతున్నాయి. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ ధర క్వింటా గరిష్ఠంగా రూ.5,939 పలికింది. గతవారంతో వేరుశనగ ధరలను పోల్చితే క్వింటాకు రూ.600 పైగా ధర తగ్గింది. రబీలో బోరు బావుల కింద సాగైన వేరుశనగ పంట చేతికందడంతో రైతులు విక్రయానికి తీసుకొస్తున్నారు. ధరలు పతనం కావడంతో ఆందోళన చెబుతున్నారు. వేరుశనగ నాణ్యత లేకపోవడంతోనే ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు తెలిపారు. ఆదోని మార్కెట్‌కు సోమవారం 142 బస్తాల వేరుశనగ విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,659, గరిష్ఠ ధర రూ.5,939, సగటున రూ.5,690 పలికింది.

మామిడీలా


బంగినపల్లి మామిడి

బనగానపల్లె, మే 12: బంగినపల్లి మామిడి మన దేశంలోనే వివిధ రాష్ట్రాలతో పాటు అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. మన దేశంలో మామిడి పండ్ల ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి మొదటి స్థానం కాగా రెండో స్థానం మనరాష్ట్రంలో సాగయ్యే బంగినపల్లి మామిడిదే. ఒక్కో పండు రెండు కిలోల వరకు తూగుతుంది. ఏ మాత్రం పీచు లేకుండా పూర్తిగా గుజ్జు మాత్రమే ఉండటం దీని ప్రత్యేకత. వీటికి ఉన్న డిమాండ్ ఆసరాగా చేసుకుని వ్యాపారులు ఇతర ప్రాంతాలనుంచి కాయలను దిగుమతి చేసుకుని బంగినపల్లి మామిడి పండ్లుగా విక్రయిస్తున్నారు. గతంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ సైతం ఇష్టపడి బంగినపల్లి మామిడిని తెప్పించుకొని తినేవారు. బంగినపల్లి మామిడి తోలు పలుచగా ఉండడం, ఎంతో మాధుర్యాన్ని కలిగి ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో 12,270 ఎకరాల్లో..

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 12,270 ఎకరాల్లో మామిడి సాగవుతోంది. నంద్యాల జిల్లాలో 8396 ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 3874 మామిడి సాగవుతోంది. వాతావరణంలో మార్పులు, వివిధ తెగుళ్ల మామిడికి వస్తుండడం, పూతరాలిపోవడం, గాలివానలకు మామిడి కాయలు కిందపడడం, తెగుళ్ల రావడం, మామిడి పిందెలు రాలడం వంటి కారణాలతో మామిడి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బనగానపల్లె మండలంలో కేవలం 160ఎకరాలకు పడిపోయింది. బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామాపురం గ్రామాల్లో మామిడి 248.588 ఎకరాల్లో సాగవుతోంది. డోన్ మండలంలో 1399.436 హెక్టార్లలో ప్యాపిలి మండలంలో 588.512 హెక్టార్లలో సాగవుతోంది. ఆళ్లగడ్డలో 102.872 హెక్టార్లు, పాణ్యంలో 160.228హెక్టార్లలో, రుద్రవరంలో 126.164హెక్టార్లలో సాగవుతోంది. మామిడి పంట దిగుబడులు సరిగా రాకపోవడంతో బనగానపల్లె, ఇతర మండలాల్లోనూ మామిడి తోటలను తొలగించి వాణిజ్య పంటలవైపు రైతులు మళ్లారు. మామిడి చెట్లను కొట్టివేసి మొక్కజొన్న, కంది, జొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మామిడి రకాల్లో బంగినపల్లి ఒకటి. ఏటా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. బనగానపల్లె పరిసర ప్రాంతాల్లో వీటిని పండిస్తారు. బనగానపల్లె, యాగంటిపల్లె, జోలాపురం, పసుపల, ఇల్లూరుకొత్తపేట, భానుముక్కల తదితర ప్రాంతాల్లో దాదాపు 160 ఎకరాల్లో బంగినపల్లి మామిడిని పండిస్తున్నారు. బేతంచెర్ల మండలంలోని ఎంబాయి, సీతారామాపురం, ఆర్.ఎస్.రంగాపురం, బైనపల్లె, గ్రామాల్లో 630 ఎకరాల్లో బంగినపల్లి మామిడి పండ్లను పండిస్తారు. పంట సరిగా రాకపోవడంతో చెట్లను కొట్టివేసి ఇతర పంటలను పండించడంతో బంగినపల్లి మామిడి విస్తీర్ణం తగ్గిపోయింది.

5 నుంచి 6 టన్నుల వరకే..

హెక్టారు మామిడికి 10 టన్నులు పంట రావాల్సి ఉండగా 5 టన్నుల నుంచి 6 టన్నుల వరకే ఈఏడాది పంట దిగుబడి వచ్చింది. జనవరి నెలలో రావాల్సిన పూత వర్షాభావ పరిస్థితుల వల్ల ఫిబ్రవరి నెలాఖరులో మామిడి పూత వచ్చింది. దీనికి తోడు ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ఉన్న పూత దాదాపు రాలిపోయింది. అంతో ఇంతో నిలబడ్డ మామిడి గతనెలలో రెండు సార్లు భారీ ఈదురు గాలులు, వర్షాలు కురవడంతో మామిడి రైతులు నష్టాల్లో కూరుకుపోయారు. పెట్టుబడులు భారీగా ఉండడంతో మామిడి రైతు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.


బంగినపల్లి మామిడిని అమ్ముతున్న హోల్‌సేల్ వ్యాపారి


బంగినపల్లి మామిడి తోట

- తగ్గుతున్న బంగినపల్లి మామిడి సాగు
- గిట్టుబాటు కాని ధరలు
- వాణిజ్య పంటలవైపు రైతులు మొగ్గు
- మామిడి చెట్లు కొట్టివేత
- మొక్కజొన్న, కంది, జొన్నలు సాగు
- కృత్రిమ పక్వంతో వ్యాపారుల మాయ

విషతుల్యంగా...

బంగినపల్లి మామిడి పండ్లకు గిరాకీ ఉండటంతో కొందరు వ్యాపారులు మాయ చేస్తున్నారు. కృత్రిమ పక్వంచేసి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నారు. పసుపు పచ్చ రంగులో అచ్చం మాగిన పండు లాగా కనిపించే ఈ కాయలు ఏమాత్రం రుచి లేక పోగా విష తుల్యంగా మారుతున్నాయి. కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి పండ్లను తెప్పించుకుని బంగినపల్లి మామిడిగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రుచి లేకపోవడం, వాటిని తిన్న తర్వాత కడుపులో మంట రావడం వల్ల డబ్బులు ఇచ్చి అనారోగ్యం తెచ్చుకుంటున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు కూడా ఆకాశాన్నంటాయి. ఒరిజినల్ బంగినపల్లె వంద మామిడి పండ్లను సైజును బట్టి రూ.6వేల నుంచి రూ.8 వేలకు వ్యాపారులు అమ్ముతున్నారు. చిరువ్యాపారులు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు మామిడిపండ్లను విక్రయిస్తున్నారు.


రసాయనిక మందులతో మాగబెట్టిన మామిడి పండ్లు

తగ్గిన దిగుబడి



ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గింది. ప్రకృతి వైపరీత్యాలు, అతి వృష్టి, అనావృష్టికి తోడు భారీగా గాలులు, వర్షం పడడంతో చెట్టు మీదనుంచి మామిడి కాయలు రాలిపోయాయి. సగం పంట కూడా ఈ ఏడాది రాలేదు.

\- హమీద్, కౌలు రైతు, బనగానపల్లె

రసాయనాలతో మాగిస్తున్నారు..



గతంలో మామిడి పండ్లను బాదం, వరి గడ్డితో మాగించేవారు. పండ్లకు మంచి వాసన, రుచి ఉండేది. ప్రస్తుతం వ్యాపారులు పండ్లను కార్బైడ్, ఇతర రసాయనాలతో మాగిస్తున్నారు. దీంతో బంగినపల్లి మామిడి రుచి తగ్గింది.

\- నరసింహుడు, రిటైర్డు ఉద్యోగి, బనగానపల్లె


తోటలో కాసిన మామిడి కాయలు

లోకేశ్‌ను విమర్శించే స్థాయి ఎస్వీకి లేదు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కర్నూలు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను విమర్శించే అర్హత, స్థాయి వైసీపీ నాయకుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం ఇష్టం వచ్చినట్లు ప్రజలను, చట్టాన్ని దిక్కరించి ప్రవర్తించారన్నారు. అలాంటి వారి వివరాలు మాత్రమే రెడ్‌బుక్‌లో ఉంటాయన్నారు. అంతమాత్రాన రెడ్‌బుక్ అంటూ గగ్గోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రెడ్ బుక్ అంటే మీకెందుకంత భయమన్నారు. తప్పు చేసిన వారి విషయంలో చట్టం తనపని తాను చేసుకుంటుందన్నారు. తమ ప్రభుత్వంలో కక్ష సాధింపులకు తావు లేదన్నారు. మంత్రి హోదాలో పని చేసిన విడుదల రజనీ అధికారులతో ఎలా మసులుకోవాలో తెలియదా? అని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. హెచ్ఎన్ఎస్, ఎల్ఎల్‌సీ పనులకు నిధులు కేటాయించారన్నారు. వైసీపీ ప్రభుత్వంలా ప్రజలను తాము ఇబ్బందులకు గురి చేయడం లేదన్నారు. నారా లోకేశ్‌పై అవసవసరమైన వాఖ్యలు చేయడం మానుకోవాలని వైసీపీ శ్రేణులకు తిక్కారెడ్డి హితవు పలికారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ముత్యాల తిరుపాల్, సత్రం రామకృష్ణుడు, చంద్రకాంత్, దరూర్ జేమ్స్, షేకావలి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డుకు సీఎం హామీ

- ఎమ్మిగనూరు-కోడుమూరు రోడ్డు విస్తరణకు కూడా..
- నేషనల్ హైవే కింద చేపట్టేలా చర్యలు
- మంత్రాలయం-కర్నూలు రైల్వేలైన్‌పై విజ్ఞప్తి
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు

వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బీవీ

కర్నూలు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు దశాబ్దాల స్వప్నం. 2024 ఎన్నికల సమయంలో ఔటర్ రింగ్ రోడ్డు సహా ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారిని జాతీయ రహదారి కింద చేర్చి ఆధునికీకరణ చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు ప్రధాన రోడ్ల నిర్మాణం చేస్తే ఎమ్మిగనూరు పట్టణం వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. అదే క్రమంలో బనవాసి జెర్సీ పశుక్షేత్రం కేంద్రంగా 79 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణానికి ఈ నెల 1న సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. టెక్స్‌టైల్ రంగంలోని పరిశ్రమలు ఇక్కడికి రావాలంటే కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయానికి చేరుకోవడానికి వీలుగా రోడ్డు, రైల్వే రవాణా అత్యంత కీలకం. ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్), ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రహదారి, మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు 110 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సోమవారం సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం ఇచ్చారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం ఆవశ్యకత, రెండు దశాబ్దాల స్వప్నమైన మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి, జౌళి రంగ పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావడానికి అనువుగా రవాణా సౌకర్యం ఎంతో ముఖ్యమని చంద్రబాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు ఓఆర్‌ఆర్, ఎమ్మిగనూరు-కోడుమూరు మధ్య రోడ్డును జాతీయ రహదారుల కింద చేర్చి కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టేలా కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, మంత్రాలయం-కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు 110 కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాస్తానని సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బీవీ తెలిపారు.

సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు

ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు, ఎమ్మిగనూరు-కోడుమూరు వయా గోనెగండ్ల ప్రధాన రోడ్డును జాతీయ రహదారుల కింద చేర్చి అభివృద్ధి చేయాలని, ఎన్నో దశాబ్దాలుగా పశ్చిమ ప్రాంత ప్రజలు స్వప్నంగా ఉన్న మంత్రాలయం-కర్నూలు రైలు మార్గం నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇచ్చాను. ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎంవో నుంచి కేంద్రానికి లేఖ వెళ్లగానే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను ఒప్పించి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తాను. ఎమ్మిగనూరు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తే పట్టణం వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది.

\- బీవీ జయనాగేశ్వర రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే

బాలల్లో దేశభక్తిని ప్రేరేపించండి

'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్'లో వక్తలు


భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు



కర్నూలు కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): బాలల్లో దేశభక్తిని ప్రేరేపించే బాధ్యత తల్లిదండ్రులదేనని పలువురు మహిళా వక్తలు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్' మూడో రోజు సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమాలు ప్రేక్షకులను ఆసాంతం ఆకట్టుకున్నాయి. దేశభక్తిని చాటిచెబుతూ వివిధ మహిళా సంఘాలు, సంస్థల ప్రతినిధులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణురాలు జ్యోతిర్మయి మాట్లాడుతూ ఆచరించే మాటలకే విలువ ఎక్కువ అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజంలో తమవంతు ధర్మాన్ని పాటించినప్పుడే సమాజ వికాసం సాధ్యమన్నారు. దేశంలో ఉగ్రవాదుల్ని ప్రవేశించకుండా ప్రతి పౌరులూ బాధ్యతగా ఉండి ఉంటే ఇంతటి ఆకృత్యాలు జరిగేవి కాదని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నరసం కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి మాట్లాడుతూ దేశభక్తి అనేది సైనికులకు మాత్రమే కాదని, అది ప్రజలందరిలో ఉండాలని, జాతిని బలోపేతం చేయగలశక్తి మహిళలకు ఉందని అన్నారు. ఇటీవల వింగ్ కమాండర్లు వ్యోమిక సింగ్, సోఫియా ఖురేషి నిర్వహించిన పాత్ర మహిళాశక్తికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ నగరూరు శమంతకమణి, రాష్ట్ర సేవికా సంస్థ జిల్లా అధ్యక్షురాలు విశాలాక్షి, విశ్రాంత అధ్యాపకురాలు విజయలక్ష్మి, డాక్టర్ జయలక్ష్మి, సంగీత విద్వాంసురాలు సరస్వతమ్మ, కవయిత్రి కల్యాణదుర్గం స్వర్ణలత, రచయిత్రులు ఆరేపల్లి వరలక్ష్మమ్మ, సునీత, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని తదితరులు ప్రసంగించారు.

అలరించిన దేశభక్తి గీతాలు: సమాజాభివృద్ధిలో, దేశ రక్షణలో మహిళల పాత్రను వివరిస్తూ గాయకులు, నృత్య కళాకారులు ప్రదర్శించిన పలు అంశాలు ఆకట్టుకున్నాయి. గాయని సుజాత, కరీముల్లా శిష్యబృందం నృత్య ప్రదర్శన, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ మూడోరోజు సోమవారం కేవలం మహిళా శక్తిని చాటిచెప్పేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా మంగళవారం సాయంత్రం జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.


జ్యోతిప్రజ్వలనతో జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న మహిళలు

వైభవం.. కోసిగయ్య రథోత్సవం

● జనసంద్రమైన కోసిగి ● మొక్కులు తీర్చుకున్న నూతన దంపతులు


రథోత్సవంలో సందడి చేస్తున్న కొత్తగా పెళ్లయిన దంపతులు

కోసిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల దైవం కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) మహారథోత్సవం సోమవారం వైభవంగా సాగింది. సాయంత్రం కోసిగిలోని తేరుబజారు మైదానంలో జరిగిన రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కోసిగయ్య స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారిని రథంపై కొలువుదీర్చారు. స్వామివారి నామస్మరణ నడుమ రథోత్సవం వైభవంగా సాగింది. రథోత్సవంలో నూతన దంపతులు రథంపై ఉన్న కలశాన్ని దర్శించుకోవడం ఇక్కడి ఆనవాయితీ. అందుకే కొత్తగా వివాహాలు చేసుకున్న దంపతులు స్వామివారి రథోత్సవ కలశాన్ని తిలకించేందుకు తరలివచ్చారు. సాయంత్రం జరిగిన రథోత్సవంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో సాయికుమార్, ఆలయ అర్చకులు శ్రీరాములు, విష్ణుచిత్తు, దుర్గాప్రసాద్, ధర్మకర్తలు శ్రీనివాసులు దొర, మురళీదొర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, తాయన్న, అయ్యన్న, భరత్ శెట్టి, చింతలగేని నర్సారెడ్డి, వెంకటేశ్, ఈరన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంతరెడ్డి బందోబస్తు పర్యవేక్షించారు.

అశేష భక్తజనవాహిని నడుమ కోసిగయ్య స్వామి రథోత్సవం



అలంకరణలో కోసిగయ్య స్వామి






రథోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి



ఎర్రా ఎర్రని సూరీడు అందరి నేస్తం.. పంటలకు ప్రాణమిచ్చే సూరీడు జీవకోటికి ప్రాణాధారం.. వేసవిలో మండుటెండలతో భయపెట్టే సూరీడు కూడా ఎందుకో భయపడినట్లున్నాడు. అందుకే ఇలా చెట్టు చాటున దాగిపోయాడు. సోమవారం కర్నూలు జగన్నాథ గుట్టపై సూర్యాస్తమయాన ఓ ఈత చెట్టు వెనుక వైపు సూర్యుడు ఇలా సుందరంగా కనిపించాడు.

- కర్నూలు(ఆంధ్రజ్యోతి)
ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ఇటీవలి కాలంలో యువత బైక్‌పై విన్యాసాలు చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. ఖాళీగా రోడ్డు కనిపిస్తే చాలు చేతులు వదిలేసి బైక్‌లు నడపడం, బైక్‌లపై నిల్చుని ప్రయాణిస్తూ ఒళ్లు గగుర్పొడిచేలా విన్యాసాలు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో లైక్‌లు, వ్యూస్, ఫేమ్ కావడం కోసం యువత ఇలాంటి విన్యాసాలు చేస్తోంది. సోమవారం కర్నూలు నగర శివారులోని నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిపై యువకులు ఇలా బైక్‌పై ప్రమాదకర విన్యాసాలు చేస్తూ కనిపించారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)

పథకం ప్రకారమే హత్య?



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న పోలీసులు

(5వ పేజీ తరువాయి)

అయితే సదరు యజమానికి చెందిన బంధువుల్లో ఇద్దరు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సదరు గొర్రెల కాపరికి, యజమాని కుటుంబ సభ్యులతో పాటు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులతో వివాదం మొదలైంది. గొర్రెల కాపరి చేసిన పనికి కుటుంబ పరువు బజారున పడుతుందని ఆ కాపరిపై కక్ష పెంచుకున్నట్లు సమాచారం. యజమాని కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారా..? లేక వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న ఆ ఇద్దరు వ్యక్తులు సదరు కాపరిపై కక్ష పెట్టుకున్నారా...? అన్న విషయంలో మరింత స్పష్టత రావాల్సి ఉంది. ఏప్రిల్ 23వ తేదీన గడివేముల మండల పరిధిలో సదరు గొర్రెల కాపరితో పాటు మరోక వ్యక్తి కూడా మద్యం కొనుగోలు చేసినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డయినట్లు సమాచారం. మొత్తంగా గొర్రెల కాపరిని పథకం ప్రకారమే హత్య చేసినట్లు దర్యాప్తులో వెలుగు చూసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

మద్యం తాపి ఆపై...

పథకం ప్రకారమే గొర్రెల కాపరిపై కక్ష పెంచుకున్న రెండు వర్గాలు సైతం (వీరిలో ఏ వర్గం ఈ దాడికి పాల్పడిందో) సదరు కాపరిని అంత మొందించడానికి వ్యూహాత్మకంగా పథకం వేసినట్లు తెలుస్తోంది. సదరు కాపరికి మద్యానికి బానిసగా ఉండటంతో సదరు నిందితులకు మరింత కలిసి వచ్చినట్లైంది. గత నెల 23న పథకంలో భాగంగా మద్యం షాపునకు పంపారు. ఆ తర్వాత అక్కడి నుంచి కాపరిని మాయమాటలతో నమ్మించి.. ఈనెల 9వ తేదిన గడివేముల మండల శివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. నిందితులు మాటువేసి మద్యం సేవించిన తరువాత కాపరిని రాళ్లతో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. అనుమానం రాకుండా మృతదేహంపై పెట్రోల్ లేదా యాసిడ్ పోసి నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది. తర్వాత ఆనవాళ్లు గుర్తు పట్టకుండా పెద్ద ఎముకలను పొడి చేసి అక్కడక్కడ పడేశారని తెలిసింది. మిగిలిన కొన్ని ఎముకలను సైతం వేర్వేరుగా విసిరేసినట్లు సమాచారం. ఇదంతా చూస్తుంటే ఎంతో కర్కశంగా సదరు కాపిరిని హత్య చేశారనే విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు నిందితులను డీఎస్పీ నేతృత్వంలో సీఐ, ఇద్దరు ఎస్ఐలు తదితర సిబ్బంది కలిసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో ఒక్కొక్కరిగా విచారణ చేయగా.. పలు ఆసక్తి విషయాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో పోలీసుల్లోను ఉత్కంఠ రేపుతోందని తెలిసింది.

కొందరు పోలీసులపై ఆరోపణలు

ఈ ఘటన విషయంలో లోతుగా పరిశీలిస్తే కొందరు పోలీసులపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ రైతు తన పొలంలో గత నెల 28వ తేదిన జొన్న పంటను తొలగిస్తుండగా.. అస్థి పంజరం ఆనవాళ్లు బయటపడ్డాయని గడివేముల పోలీసులకు సమాచారం అందించాడు. ఆ తర్వాత పోలీసులు సైతం సంఘటన స్థలానికి స్పష్టత లేని ఆనవాళ్లు ఉన్నాయని గ్రహించారో..? లేక గుర్తు తెలియని శవం కదా...? భవిష్యత్‌లో మనకెందుకు సమస్య అని వదిలేశారో..? కానీ స్పాట్‌కు వెళ్లి కూడా ఆ రోజున పోలీసులు కేసు నమోదు చేయకుండా వదిలేశారు. ఆ తర్వాత ఆనవాళ్లు సైతం బూడిద కావడంతో పోలీసులే ఈ పని చేయించారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతటితో ఆగకుండా సదరు ఆనవాళ్ల ఫొటోలు తీసిన రైతుతో కూలీలు (ఇతర వ్యక్తులు) సెల్‌ఫోన్లు తీసుకుని పోలీసులు డిలీట్ చేయించడం అనుమానాలకు తావిస్తోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసుల్లో ఒకింత ఆందోళన కలిగిస్తోంది. మొత్తం మీద నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై ఎలాంటి చర్యలు ఉంటాయోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

ఆర్టీసీ బస్సులో చోరీ

- 4 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ఆదోని నుంచి కర్నూలుకి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సోమవారం సాయంత్రం చోరీ జరిగింది. వివరాల మేరకు.. పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిలో స్టాఫ్ నర్స్‌గా పని చేస్తున్న స్వప్న నంద్యాలకు వెళ్ళేందుకు ఆదోని ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలుకి వెళ్తున్న బస్సును ఎక్కింది. ముందుగా సీటు పట్టుకునేందుకు బస్సు ఎక్కి తన హ్యాండ్ బ్యాగ్‌ను సీట్లో ఉంచి, పక్కన ఉన్న మరో ప్రయాణికురాలికి చూస్తుండమని చెప్పి లగేజీ తీసుకురావడానికి వెళ్లింది. అయితే తిరిగి వచ్చి చూడగా తర్వాత హ్యాండ్ బ్యాగ్ జిప్పు ఓపెన్ చేసి ఉండటంతో అనుమానం వచ్చి చూడగా, అందులోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు రూ.30వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. వెంటనే విషయాన్ని కండక్టర్, డ్రైవర్‌కు చెప్పడంతో బస్సు నిలిపేసి ప్రయాణికులను విచారించారు. ఎంతకీ లభ్యం కాకపోవడంతో బాధితురాలు స్వప్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని, సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

హాలహర్వి తహసీల్దార్‌పై వేటు

- సరెండర్ చేయాలని కలెక్టర్ ఉత్తర్వులు
- డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మికి ఇన్‌చార్జిగా బాధ్యతలు



ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మి

హాలహర్వి, మే 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ నజీమాబానుపై వేటు పడింది. విధుల పట్ల నిర్లక్ష్యం, వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాకపోవడం, రెవెన్యూ సమస్యలు పరిష్కారం కాకపోవడం తదితర ఫిర్యాదులు రావడంతో ఆమెను సరెండర్ చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా ఆర్డీవోను ఆదేశించారు. మండల ప్రజలు రెవెన్యూ సమస్యలతో కోర్టులు, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఫిర్యాదులు వెల్లడంతో కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఆమెను విధుల నుంచి తప్పించి డీటీ లక్ష్మిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

మద్యం స్వాధీనం

శిరివెళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన యోగానంద్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తుండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య తెలిపారు. అతడి వద్ద నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చెప్పారు.

రమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

మిడుతూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మిడుతూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులుజేసి ఆలయం నుంచి పూలతో అలంకరించిన రథం వరకు తీసుకొనివచ్చి ప్రదక్షిణలు చేశారు. దేవదాయశాఖ అధికారులు, భక్తులు రథం చుట్టూ ప్రదక్షిణలు చేసి టెంకాయలు సమర్పించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంలో కొలువుదీర్చి ఉత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు ఆవరణ వరకు ఈ రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే జయసూర్య మాండ్ర శివానందరెడ్డి

రథోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డికి ఏవో వెంకట రమణ ఆధ్వర్యంలో పురోహితులు, ఆలయ చైర్మన్ భూమ కృష్ణమోహన్ రావు వారికి పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి చెన్నకేశవ స్వామికి పూజలు చేశారు.



జలాశయాన్ని పరిశీలిస్తున్న సీడీవో బృందం

శ్రీశైలం డ్యామ్ పరిశీలన

శ్రీశైలం, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ కమిటీ బృందం సోమవారం శ్రీశైలం జలాశయాన్ని పరిశీలించింది. శ్రీశైలం జలాశయానికి ప్లాంజ్ పుల్ గుంత ఏర్పడిన కారణంగా డ్యామ్ భద్రత చర్యలు తీసుకునేందుకు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచించిన అంశాలలో డిజైనింగ్ లోపాలను పరిశీలించేందుకు వచ్చినట్లు సీడీవో ఎస్ఈ శివప్రసాద్ తెలిపారు. పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీశైలం డ్యామ్‌కు ఎటువంటి ప్రమాదం లేదని, ప్రస్తుతం జలాశయం బేస్‌మెంట్ గట్టిగా ఉందని చెప్పారు. 1986 నుంచి డ్యాం బేస్‌మేంట్ సేఫ్టీ కొరకు ఏర్పాటు చేసిన సేఫ్టీ సిలిండర్లలో 12 సిలిండర్లు పాడైపోయాయని తెలిపారు. వాటికి సంబంధించిన మరమ్మతుల చర్యల నిమిత్తం శ్రీశైలానికి వచ్చినట్లు తెలిపారు. ఈ పనులను పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అదేవిధంగా ప్లాంజ్ పుల్ గుంతకు మరమ్మతులు జరపాలని, డ్యామ్ సేఫ్టీ సిలిండర్ల వరకు పర్యవేక్షణ రోడ్డును ఏర్పాటు చేసేందుకు జలవనరులశాఖ అధికారులకు సెంట్రల్ డిజైనింగ్ కమిటీ ప్లాను అందజేయనున్నట్లు ఎస్ఈ తెలిపారు.

పెళ్లింట విషాదం

- తలంబ్రాల మరుసటి రోజే పెళ్లికూతురి తల్లి ఆత్మహత్య



దేవి (ఫైల్)

నంద్యాల టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిన్నకూతురు పెళ్లి కార్యక్రమాలు ముగియక ముందే తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో పెళ్లింట విషాదం నెలకొంది. ఈ ఘటన పట్టణంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలివీ.. పట్టణంలోని నూనెపల్లెకు చెందిన దేవి (45) కూతురు వివాహం ఈనెల 11న ఘనంగా జరిపించారు. అయితే తలంబ్రాల మరుసటి రోజు సోమవారం తెల్లవారుజామున దేవి చిన్న చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారుజామున 3 గంటల తర్వాత దేవి ఇంటి నుంచి వెళ్లింది. అయితే పశువుల వద్దకు వెళ్లి ఉంటుందని అనుకున్నారు. ఉదయం మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమయ్యారు. దేవి చిన్న కూతురును శిరివెళ్ల మండలం బోయిలకుంట్ల గ్రామానికి ఇచ్చి వివాహం చేశారు. దేవికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, భర్త నాగేశ్ ఉన్నారు. అనారోగ్యంతో దేవి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

సీహెచ్‌వోల మానవహారం



రాజ్‌విహార్‌లో మానవహారం చేస్తున్న సీహెచ్‌వోలు

కర్నూలు హాస్పటల్, మే 12 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె ఉధృతమైంది. సోమవారం ఉదయం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నుంచి రాజ్‌విహార్ వరకు సీహెచ్‌వోలు ర్యాలీగా వెళ్లారు. అనంతరం రాజ్‌విహార్‌లో మానవహారం నిర్వహించారు. మానవహారం వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అనంతరం సీహెచ్‌వోలు ర్యాలీగా దీక్షా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు చందన, వైస్ ప్రెసిడెంటు నాగరాజు, కోశాధికారి కార్తిక్ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలన్నారు.

ఏఐటీయూసీ మద్దతు..

సీహెచ్‌వోల సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మద్దతు తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

రైల్వేగేట్‌ను ఢీకొన్న కారు

- గాజులపల్లి స్టేషన్‌లో అరగంట పాటు నిలిచిన తిరుపతి-గుంటూరు రైలు
- నాలుగు గంటలపాటు వాహన రాకపోకలకు అంతరాయం
- డ్రైవర్‌పై కేసు



రైల్వే గేట్‌ను ఢీకొని దెబ్బతిన్న కారు

మహానంది, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ ప్రధాన రైల్వే గేట్‌ను సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఓ కారు ఢీకొట్టింది. పైగా ఆ కారు రైల్వే ట్రాక్‌పై ఆగిపో యింది. దీంతో ఆ మార్గంలో వెళ్లే రైలుకు అంతరాయం ఏర్పడింది. తిరుపతి నుంచి గుంటూరుకు వెళ్లే రైలు నంద్యాల స్టేషన్ దాటిన తర్వాత గాజులపల్లి వద్ద సిబ్బంది గేట్ వేశారు. అయితే కర్నూలు నుంచి వెళ్తున్న కారు గేట్‌ను ఢీకొట్టి రైల్వే ట్రాక్‌పై ఆగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది తిరుపతి-గుంటూరు రైలు గాజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఆగేలా చర్యలు తీసుకున్నారు. చివరికి రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ఉన్న కారును పక్కకు తొలగించి రైలు యథావిధిగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అయితే అర్ధగంట రైలు అరగంట ఆలస్యంగా వెళ్లింది. రైలు గేట్లు దెబ్బతినడంతో లాక్ ఓపెన్ కాలేదు. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. ఘటనా స్థలాన్ని నంద్యాల రైల్వే పోలీసులు పరిశీలించారు. మరమ్మతుల అనంతరం ఉదయం 7గంటలకు వాహనాలు బయలుదేరాయి. నాలుగు గంటల పాటు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కారు డ్రైవర్ విష్ణువర్ధన్‌పై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది. ప్రమాదానికి గల కారణాలను రైల్వే పోలీసులు విచారిస్తున్నారు.

ఆటో బోల్తా .. యువకుడి మృతి



పవన్ (ఫైల్)

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం బస్టాండు ఎదురుగా ఆటోలో ఉన్న పైపులను దించబోయి ఆటో బోల్తా పడి యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం సోమవారం సాయంత్రం జరిగింది. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలివీ.. నందవరం మండలం నది కైరవాడి గ్రామానికి చెందిన ఆటోలో ఎమ్మిగనూరులో 8 క్వింటాళ్ల పైపులను ఆటోపై వేసుకుని మంత్రాలయం వచ్చారు. మంత్రాలయంలో అన్‌లోడింగ్ చేస్తుండగా.. నది కైరవాడికి చెందిన పవన్ (30) పైపులు ఆటో మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆటో కింద పడుతుందని ఆపేందుకు వెళ్లిన పవన్ ప్రమాదవశాత్తు ఆటో, పైనున్న పైపులు మీద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

వెలుగోడు, మే 12(ఆంధ్రజ్యోతి): వెలుగోడు, అబ్దుల్లాపురం మధ్య వెళ్తున్న ఆటోపై నుంచి పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలివీ.. రేగడగూడూరు గ్రామానికి చెందిన వంశీ (20) స్వగ్రామం నుంచి ఆటోలో వెనుకవైపు నిలబడి ప్రయాణిస్తున్నాడు. ఆటో అబ్దుల్లాపురం గ్రామ సమీపంలో మలుపు తిరుగుతుండగా ఆ యువకుడు అదుపుదప్పి ఆటో నుంచి కిందపడ్డాడు. దీంతో ఆ యువకుడి తల పగిలి తీవ్రంగా రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వంశీ తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షాషావలి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బేతంచెర్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.పెండేకల్ గ్రామానికి చెందిన యాపమాను రాజు (55) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం హెడ్ కానిస్టేబుల్ పుల్లయ్య తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన రాజు మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన రాజు ఈనెల 11న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 12న ఉదయం మృతి చెందాడు. రాజు కుమారుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

శిరివెళ్ల, మే 12 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం మహిళను వేధిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్నపీరయ్య సోమవారం తెలిపారు. వివరాలివీ.. గోవిందపల్లె గ్రామానికి చెందిన గడ్డం కవిత అనే మహిళను ఆత్మకూరుకు చెందిన మధుసూదన్‌కు ఇచ్చి పెద్దలు కొన్నేళ్ల క్రితం వివాహం జరిపించారు. కొద్ది కాలంగా భర్త, అత్తా మామతో పాటు కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకొని రావాలని వేధిస్తున్నారు. దీంతో కవిత పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్త మధుసూదన్‌తో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేఎంసీ క్యాంటీన్ మూసివేత



క్యాంటీన్‌ను మూసివేసిన యూనియన్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో ఉన్న క్యాంటీన్‌ను ఏపీజీడీఏ యూనియన్ నాయకులు సోమవారం నోటీసు అతికించి మూసివేశారు. ఏపీ గవర్నమెంటు డాక్టర్స్ అసోసియేషన్ (కేఎంసీ యూనిట్) అధ్యక్షుడు డాక్టర్ పి.బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ రోగులు, డాక్టర్లకు అల్పాహారం, భోజనం అందించే కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ మాదేనని అన్నారు. క్యాంటీన్ నిర్వాహకులకు ఇచ్చిన 5 రోజుల గడువు ముగిసిందని, వారికి ఎటువంటి హక్కులు ఉన్నా చర్చలకు రావాలన్నారు. ఏపీజీడీఏ బైలా ప్రకారం క్యాంటీన్ అసోసియేషన్‌దేనని, కోర్టుకు వెళ్లాల్సింది వారు కాదని, అసోసియేషన్ వారు వెళ్లాలని తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులు, ప్రిన్సిపాల్‌కు తెలియజేశామని, ఇచ్చిన గడువు ముగియడంతో మూసి వేశామన్నారు. ఇక నుంచి ఏపీజీడీఏ అసోసియేషన్ క్యాంటీన్‌ను నిర్వహిస్తుందని, త్వరలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి క్యాంటీన్ నిర్వహణ అంశాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీజీడీఏ కోశాధికారి డాక్టర్ డమం శ్రీనివాసులు, ఈసీ సభ్యులు డాక్టర్ రంగయ్య, డా.బాల సారయ్య, డా.సోమశేఖర్, ప్రొఫెసర్లు డాక్టర్లు నాగేశ్వరరావు, రమణ, పీజీలు పాల్గొన్నారు.

పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించాలి

కర్నూలు న్యూసిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి విడదల రజనిపై పోలీసులు చేసిన దౌర్జన్యాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని వైసీపీ రాష్ట్ర మహిళా జోనల్ ప్రెసిడెంట్ గాజుల శ్వేతారెడ్డి అన్నారు. సోమవారం ఎస్వీ కాంప్లెక్స్ ఎదుట నోటికి నల్లరిబ్బన్లు వేసుకుని నిరసన తెలిపారు. శ్వేతారెడ్డి మాట్లాడుతూ విడదల రజనిపై చిలకలూరి పేట రూరల్ సీఐ సుబ్బరాయుడు, పోలీసులు వ్యవహరించిన తీరును వైసీపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అర్షియా పర్వీన్, రాష్ట్ర మహిళా కార్యదర్శి నాగవేణిరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శశి కళ భారతి, మంగమ్మ పాల్గొన్నారు.

చలో ఆర్ఎం ఆఫీసు ముట్టడిని జయప్రదం చేయండి

కర్నూలు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం చలో కర్నూలు ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయా లని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సి.మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈకార్యక్రమానికి జోనల్ కార్యదర్శి ఎం. చెన్నారెడ్డి హాజరవుతారని తెలిపారు. కర్నూలు-1డిపో దగ్గర ఉదయం పదిగంటలకు రీజనల్‌లో అన్ని సభ్యులు హాజరై ఆర్టీసీలో నెలకొన్న అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఈకార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఐదు డిపోల నుంచి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి: ఏవో

సి.బెళగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోకుండా రైతులు సాగు చేసిన పంటనే మరల సాగు చేయడం వలన భారీగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె మజరా గ్రామమైన చెన్నంచెట్టిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మద్దిరాళ్ల రామస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి భార్య మహేశ్వరి కార్యకర్తల సంక్షేమ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. మృతుడికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో మంత్రి నారా లోకేశ్ సహకారంతో రూ.5 లక్షలు బీమా చెక్కును సోమవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మృతుడి భార్య మహేశ్వరికి అందజేశారు. మృతుని కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బయ్య, ఎద్దుల నాగేశ్వరరెడ్డి, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, శ్రీరామ శ్రీనివాసరెడ్డి, నాగ మల్లేష్, ప్రతాప్, సంజీవ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా వేయాలి

కర్నూలు న్యూసిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ శివారులో ఓ పరిశ్రమ విస్తరణలో భాగంగా ఈ నెల 14న చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ, బహిరంగ విచారణ వాయిదా వేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాజీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ గాంధీ వద్ద ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. పరిశ్రమ విస్త రణ కోసం తయారు చేసిన ముసాయిదా పర్యావరణ ప్రభావ అంచనా నివేదికను సవరించాలని, ఆ తరువాతే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి ప్రతం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంఘం రామకృష్ణ, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ కె.విజయ భాస్కర్‌రెడ్డి, డీటీఎఫ్ ఆర్.రత్నం, ఆర్‌సీఎస్ నాయకుడు బి.సుంకన్న, ఎస్‌యూసీఐ బి.నాగన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ, కేవీపీఎస్ ఆనంద్‌బాబు, డీవైఎఫ్ఐ నగేశ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కర్నూలు క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో కొంతలపాడు గ్రామంలో ఈనెల 7న శ్రీనివాసులు ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శ్రీధర్‌లు సోమవారం రాత్రి నిందితుని వివరాలు వెల్లడించారు. కృష్ణగిరి మండలం పోతుగల్లు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కలాం ఈ దొంగతనానికి పాల్పడ్డాడు. బాధితుడు శ్రీనివాసులు ఈనెల 7న ఇంటికి తాళం వేసి బంధువుల ఊరిలో దేవర ఉండగా అక్కడకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం వచ్చి చూస్తే ఇంట్లో ఉన్న బీరువా తలుపులు తెరిచ్చి ఉన్నాయి. బీరువలో ఉన్న 14 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు నిందితుని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 14 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

నర్సులు సేవామూర్తులు

● కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

● కర్నూలు జీజీహెచ్‌లో ఘనంగా నర్సుల దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు వైద్య చికిత్సలు అందించే నర్సులు సేవామూర్తులు అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కొనియాడారు. సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ధన్వంతరి హాలులో ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వ హించారు. ముఖ్యఅతిథులుగా కోడుమూరు ఎమ్మెల్యే, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రీబాయి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.విమలమ్మ పాల్గొని ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు క్యాండిల్ లైట్ వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ ఆసుపత్రిలో నర్సుల సమస్యలు చాలా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి మాట్లాడుతూ నర్సెస్ అసోసియేషన్‌కు ఆసుపత్రిలో భవనం కేటాయించాలని, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని కోరారు. సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫ్లోరెన్ నైటింగేల్‌ను



ఫ్లోరెన్స్ నైటింగ్‌కు పూలమాల వేస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి



వేడుకల్లో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, నర్సింగ్ సిబ్బంది

ప్రతి నర్సు ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు కార్యక్రమంలో ఏపీ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.లీలావతి, సి.బంగారి, రాష్ట్ర ఉపాధ్యక్షు రాలు జి.శాంతిభవాని, జిల్లా కోశాధికారి ఎన్.లక్ష్మీనరసమ్మ, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

సీటీవీఎస్ విభాగంలో.. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గుండె, ఊపిరితిత్తుల చికిత్స విభాగంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సిటీవీఎస్ విభాగాధిపతి డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రిబాయి, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ జి.విమలమ్మ ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినిత్యం బైపాస్ సర్జరీ చేసిన రోగుల ఆరోగ్యం కోసం నిత్యం తపించే నర్సుల మధ్య వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సు పద్మా వతి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పిటల్‌లో.. కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కర్నూలు జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్పీ సావిత్రిబాయిని సన్మానించారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రమణీయం.. చెన్నకేశవస్వామి రథోత్సవం

ఓర్వకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో చెన్నకేశవస్వామి రథోత్సవం అశేష భక్తుల మధ్య రమణీయంగా సాగింది. సోమవారం ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు చేశారు. స్వామి, అమ్మవా ర్లను రథంపై అధిష్టించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. స్వామి, అమ్మవార్లకు పురోహితులు విష్ణుశర్మ, అర్చకులు నారాయణరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవానికి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ చేసి పూజలు చేసి రథాన్ని ప్రారంభించారు. ఆలయం ముందు నుంచి రథాన్ని లాగి ఊరేగించి యథాస్థానంలో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, లలితమ్మ, కురువ లక్ష్మీదేవి, వడ్డె భువనేశ్వరి, బోయ లక్ష్మీదేవి, దేవయ్య, రవిశంకర్, గ్రామ నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, అబ్దుల్లా, అల్లాబాబు, ప్రజలు పాల్గొన్నారు.

● **శకునాలలో:** మండలంలోని శకునాల గ్రామంలో చెన్నకేశవస్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరై స్వామివార్లకు ప్రత్యేక పూజలు



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నాయకులు

చేశారు. అర్చకులు మనోహర్ శర్మ, జంగం శివనాగయ్య రథానికి పూజలు చేశారు. రథాన్ని లాగి యథాస్థితిలో నిలిపారు. శకునాల గ్రామంలో చెన్నకేశవస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రీన్ కో ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ మల్లికార్జున రెడ్డి, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస నాయుడు, గ్రామ నాయకులు మౌళీశ్వ రరెడ్డి, రామాంజనేయులు, హరికృష్ణగౌడు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పష్టమైన జీవోలు లేకుండా రోజుకొక ఆలోచనలతో జరుగుతున్న ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ అందరి లో నూ తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. జీవో.117 రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీవో విడుదల చేసి దాని ఆధారంగా పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఆదర్శ పాఠశాలలో 5 తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 120 మించితే 6వ ఎస్జీటీ ఉపాధాయడిన్ని, ఆ పైన ప్రతి 30 మందికి ఒక ఎస్ జీటీ చొప్పున కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశా లలో సమాంతర మీడియాన్ని కొనసాగించాలన్నారు. జిల్లాలో పదోన్న తుల సీనియారిటీ సంబంధించిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. అన్ని జిల్లాలో పదోన్నతులు సమస్యలు పరిష్కరించిన తర్వాతనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలను పరిశీలించి, నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పునరా వృతం కాకుండ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ముఖ్యంగా టిడ్కో గృహలకు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శేష సాయి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి

గూడూరు మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తహసీల్దార్‌కు అర్జీలు సమర్పించారు. అలాగే రేషన్ కార్డులకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గూడూరు మే 12(ఆంధ్రజ్యోతి): గూడూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శివనాగప్రసాద్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల మీట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణుకు సన్మానం



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన డి.విష్ణువర్ధన్‌రెడ్డిని 38, 39, 40 వార్డులకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. నాయకులు బిర్రు ప్రతాప్‌రెడ్డి, కురువ చంద్రశేఖర్, నాగమధు మార్కెండేయులు, సుమియన్, నాగన్న, సలీం, ఇస్మాయిల్, గౌడ్, ప్రవీణ్, నరసింహులు, వరప్రసాద్, సమీర్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: ఇటీవల ఎన్నికైన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని గ్యాస్ట్రో ఎంట్రాలజి వైద్యులు బి.శంకర్‌శర్మ అభినందనలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రైతుల పంట సాగు కోసం అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందించాలని ఆయన చైర్మన్‌ను కోరారు.

'బ్రాహ్మణులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి'

కర్నూలు కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): పేద బ్రాహ్మణులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ వెంకటరామరాజు అన్నారు. సోమవారం నగరంలోని సమాఖ్య కార్యాలయంలో గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద బ్రాహ్మణులంతా నూతన రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యోగేంద్రనాథ్, కాశీప్రసాద్, గాయత్రి బ్రాహ్మణ సంఘం నాయకులు హనుమంతరావు, శిరీష, శర్మ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, మే 12(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్నతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లును కలిశారు. ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఎంసీ కాశన్న, జిల్లా సంయుక్త కార్యదర్శులు కృష్ణుడు, చిరంజీవి, జిల్లా అసోసి యేట్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, నగర అసోసియేట్ అధ్యక్షుడు ఆళ్లె శ్రీనివాసులు, నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సి.బంగారి పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

కోడుమూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న మాట్లాడుతూ వీఆర్ఏలకు నెలకు వేతనం రూ.26వేలు ఇవ్వాలని, టైం స్కెల్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, వీఆర్ఏలు గంగాధర్, రాజు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, మే 12(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్‌బాషా కలిసి ఇన్‌చార్జి కలెక్టర్ బి.నవ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడేళ్ల నుంచి నోటిఫికేషన్ లేకపోవడం నిరుద్యోగులు వయస్సు మీద పడి డీఎస్సీకి అనర్హులుగా అవుతున్నారు. వెంటనే 47 సంవత్సరాలకు వయస్సు పెంచాలని, పర్సంటేజీ నిబంధనలు తొలగించాలని కోరారు.

● నగరంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా లేజర్ ట్రీట్మెంట్ నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నా కలర్స్, అనూస్, మిస్టీ లాంటి హెయిర్ అండ్ స్కిన్ సెంటర్లను సీజ్ చేసి వాటి నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ సంఘం నాయకులు ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాసులు, నాయకుడు నాగరాజు పాల్గొన్నారు.

● హోళగుంద మండలం మార్లమడికి గ్రామ రైతులు కే.కర్రెన్న, నల్లారెడ్డి, ఎన్.భాస్కర్, గోవర్ధన్, రాములు మా గ్రామంలో ఈ సంవత్సరం జొన్న పంట వేశాం. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయ్ వారిచే



ఇన్‌చార్జి కలెక్టర్‌కు సమస్య విన్నవిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జొన్నలను కొనుగోలు చేశారు. అయితే ఇంకా కొంత మంది రైతుల వద్ద దాదాపు 700 క్వింటాళ్ల జొన్నలు ఉన్నాయి. వీటిని కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ పొలిమేరలో సర్వే. నెంబర్ 405లో ఎకరా 49 సెంట్లు, సర్వే.నెంబర్.410లో ఎకరా 68 సెంట్లు భూమి ఉందని కర్నూలు నగరం గోపినగర్ నివాసి జగన్నాథ రెడ్డి. తెలిపారు. ఈ భూమి మా పెద్దల ఆస్తి దీని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ బదిలీల ఉత్తర్వులు విడుదల చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల ఉత్తర్వులు విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కే.సురేష్ కుమార్ అన్నారు. సోమవారం యూటీఎఫ్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జిల్లా అధ్యక్షుడు యూఆర్ఏ రవికుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర సహాధ్యక్షుడు కే.సురేష్ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నవీన్ పాటిల్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే అమలు చేస్తుందన్నారు. జీవో.117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు రద్దు చేయలేదన్నారు. రాష్ట్రంలో 9 రకాల పాఠశాలలను తీసుకువస్తున్నారని అన్నారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యేహోషువ, కార్యదర్శులు తిమ్మన్న, బాబు, చంద్రకళ, దుర్గాప్రసాద్, కౌలన్న, భాస్కర్, ఆడిట్ కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి ఆహ్వానం

కల్లూరు, మే 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న మహా కుంభాభిషేకానికి ఎమ్మెల్యే గౌరు చరితను ఈవో రామకృష్ణ ఆహ్వానం పలికారు. సోమవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆలయ అర్చకులతో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ఉయ్యాలవాడలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఓర్వకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ సబ్ స్టేషన్‌లోని సోమవారం రూ.1.25 కోటితో అదనపు 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఈ.శేషాద్రి, ఎంఆర్‌టీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ లత, డిప్యూటీ ఇంజనీర్ సుబ్బన్న, డిప్యూటీ ఎగ్జిక్యూ టీవ్ ఇంజనీర్, ప్రొడక్షన్ శారద, అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్‌బాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జరిమానా

కర్నూలు క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 16 మందికి కోర్టు జరిమానా విధించింది. గత వారం రోజుల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 16 మందిని సోమవారం కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వీరికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

కోడుమూరు రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమలగుర్తిలో లక్ష్మీనరసింహ ఈరన్నస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఆరుపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. పోటీకి వివిధ చోట్ల నుంచి 7 జతల ఎద్దులు వచ్చాయి. ఈ పోటీలో ఉండవల్లి మండలంలోని కంచుపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి ఎద్దులు 5700 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి పొందాయి. రెండో విజేతగా వెంకటగిరి శషాంక్, శ్రేయ ఎద్దులు, మూడో విజేతగా ఈడిగోనిపల్లె వంశీక్రిష్ణ, దైవందిన్నె లక్ష్మీనరసింహ ఎద్దులు సంయుక్తంగా, నాలుగో విజేతగా ప్యాలకుర్తి జాకీర్‌హుశేన్ ఎద్దులు నిలిచాయి. విజేతలకు దాతలు ఏ.శ్రీనివాసరెడ్డి రూ.40వేలు, క్రిష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి రూ.30వేలు, గుడికాటి బ్రదర్స్ రూ.20వేలు, గాజులదిన్నె వేణుగోపాల్‌రెడ్డి రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. మంగళవారం పొట్టేళ్ల ఢీ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

సి.బెళగల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పరమేష్‌నాయక్ వాహనదారులను హెచ్చరించారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో వాహనాల తనిఖీలో భాగంగా గత రెండు రోజులుగా ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వారిని సోమవారం కోర్టుకు పంపగా ఒక్కొకరికి రూ5,000 వేలు, అలాగే బహిరంగా ప్రదేశాలలో మద్యం తాగుతూ పట్టుబడిన 18 మందికి న్యాయాధికారి ఒక్కొకరికి రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల ఆకలి కేకలు

- నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించని ప్రభుత్వాలు
- సిబ్బందిదీ అదే పరిస్థితి



ఈ చిత్రంలో కనిపిస్తున్న కూలీ పేరు ఈరమ్మ, గూళ్యం గ్రామం. నాలుగు నెలలుగా ఉపాధి పనులు చేసినా వేతనాలు రాలేదు. దీంతో తప్పని పరిస్థితిలో కర్ణాటక రాష్ట్రంలోని గ్రామాల్లో పనులకు వెళుతోంది. ఉపాధి పనికి వెళితే కూలీ ఇస్తారన్న నమ్మకం లేదంటోంది.

హాలహర్వి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండుటెండలో పనిచేస్తే తమ కడుపు కాల్చుతున్నారని, తమకు ఆకలి కేకలు తప్పడం లేదన ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మొత్తం 24గ్రామాలు ఉండగా, 10,345జాబ్ కార్డులు, పనిచేసే జాబ్‌కార్డులు 8,836 కాగా 15,636 వేల మంది కూలీలు పనులకు వస్తున్నారు. అయితే జనవరి నెల నుంచి ఇంతవరకు చేసిన పనులకు వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఎలా బతకాలని కూలీలు ప్రశ్నిస్తున్నారు.

అధికారుల ఊకదంపుడు ప్రచారం

వలస వెళ్లొద్దు ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పిస్తామని అధికారులు గ్రామాలకు వెళ్లి ఊకదంపుడు ప్రచారం చేస్తున్నారని కూలీలు అంటున్నారు. తీరా పనికి వేస్తే ఇలా నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

సిబ్బందికి కూడా జీతాలు లేవు

ఇటు కూలీలకే కాదు ఉపాధి పథకం కింద పనిచేసే సిబ్బంది మేటీలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు లేవు. దీంతో ఇటు కూలీలకు సమాధానం చెప్పలేక, ఉపాధి సిబ్బంది కూడా తలలు పట్టుకుంటున్నారు. కూలీల సంఖ్య తగ్గితే అధికారులు ఒత్తిడి తెస్తున్నారని, తీరా పనిచేసిన వారికి వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా పనికి వస్తారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వేతనాలు, జీతాలు రాకపోవడం వాస్తవమే



ఉపాధి కూలీలకు నాలుగు నెలలుగా వేతనాలు, మూడు నెలలుగా ఉద్యోగులకు జీతాలు రాకపోవడం వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల ఈ సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని జిల్లా, రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం. **- పక్కీరప్ప, ఏపీడీ, ఆలూరు**

రాజకీయ గ్రహణం

- తమవారికే రుణాలు ఇవ్వాలని నాయకుల సిఫారసు
- కొలిక్కి రాని బీసీ సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక

దేవనకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఇవ్వాల్సిన రాయితీ రుణాల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ నాయకులు తల దూర్చడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని అధికార పార్టీ నాయకులు తమ అనుచరులకే ఇవ్వాలని బ్యాంకర్లకు సిఫారసు చేస్తూ, ఒక్కో యూనిట్‌కు రెండు, మూడు లెటర్‌ప్యాడ్‌లు ఇస్తున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపిక కొలిక్కి రావడం లేదు. ఎవరు నిజమైన లబ్ధిదారుడో అర్థకాక బ్యాంకర్లు కూడా యూనిట్ల పంపిణీలో జాప్యం చేస్తున్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు 50 శాతం రాయితో రుణాలు ఇచ్చేందుకు మండలానికి 50 యూనిట్లు కేటాయించింది. మండలంలోని దేవనకొండ, తెర్నేకల్, పి.కోటకొండ, కప్పట్రాళ్ల, కోడుమూరు పరిధిలో ఒకో బ్యాంక్‌కు 10 యూనిట్లు చొప్పున 50 యూనిట్లు మంజూరయ్యాయి. రాజకీయాలకతీతంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.



దేవనకొండ మండల పరిషత్ కార్యాలయం

బ్యాంకర్ల నుంచి స్పందన లేదు

సబ్సిడీ రుణాల లబ్ధిదారుల 50 మంది జాబితాను ఇప్పటికే బ్యాంకులకు పంపాం. అయితే రుణాల మంజూరు వివరాలు ఇవ్వడంలో బ్యాంకర్ల నుంచి స్పందన లేదు. **- బీవీ రమణరావు, ఎంపీడీవో, దేవనకొండ.**

మంత్రి లోకేశ్‌ను కలిసిన నాయకులు



మంత్రితో పత్తికొండ టీడీపీ నాయకులు

పత్తికొండ, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చల్లా రవీంద్రనాథ్‌చౌదరి, చల్లా కుమార్ కలిశారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రితో నియోజకవర్గ సమస్యల పరిష్కారంపై చర్చించారు. స్పందించిన మంత్రి వివరాలను కార్యాలయంలో ఇచ్చి వెళ్లాలని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

రెండో రోజుకు చేరిన పాదయాత్ర



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం చేస్తున్న పాదయాత్ర రెండో రోజుకు చేరింది. సోమవారం ఉదయం కొత్తూరులో ప్రారంభమైన పాదయాత్ర సాయంత్రం ఆరేకల్లుకు చేరింది. నాయకులు లింగన్న, శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా సక్రమంగా తాగు, సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం



ధ్వంసమైన జెండా దిమ్మె

తుగ్గలి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిద్దె తండాలో నూతనంగా నిర్మించిన టీడీపీ ఎండా దిమ్మెను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారని మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు జొన్నగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అల్లర్లను సృష్టించడానికే ఇలా చేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి



గ్రామంలో మొదలైన సర్వే

మద్దికెర, మే 12 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ రైతులను కోరారు. సోమవారం స్థానిక దొరపాడు శివాలయం వద్ద పొలాల్లో భూమి పూజ చేసి రీ సర్వేను ప్రారంభించారు. మద్దికెర గ్రామ ఉత్తర హద్దులల్లో రోజూ 40 ఎకరాలు రీసర్వే చేస్తున్నామని, రైతులకు ముందుగా సమాచారం ఇస్తామన్నారు. రైతులు తమ అభ్యంతరాల ఆమోదంత తర్వాతే ఆన్‌లైన్ చేస్తామన్నారు. రీసర్వే డీటీ యువరాజు, వీఆర్వో హర్షవర్ధన్, సర్వేయర్ అనిల్ ఉన్నారు.

మురళీనాయక్ సేవలు మరువలేనివి



రోళ్లపాడు తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


తుగ్గలి, మే 12 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్ మురళీ నాయక్ సేవలు మరువలేనివని టీడీపీ నాయకులు తులసి నాయక్, శ్రీనివాసులు నాయక్, సీపీఐ నాయకులు రోళ్లపాడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సాయంత్రం రోళ్లపాడు తండాలో మురళీనాయక్ కు నివాళి అర్పిస్తూ కొవ్వొ తులతో ర్యాలీ నిర్వహించారు. ఆనంద్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వాటర్‌మెన్ మృతి

ఆలూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరికెరతండా వాటర్‌మెన్ ఈరన్న(50) సోమవారం మృతి చెందాడు. మృతుడు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తు న్నాడు. ఆయన మృతి పట్ల ఏఈ రామ్‌లీలా సంతాపం ప్రకటించి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఆక్రమణలపై విచారణ చేయాలి

- ఆర్డీవోకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న క్రాంతి నాయుడు

పత్తికొండ టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ చేయాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో భరత్ నాయక్‌కు పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాన్నారు. పత్తికొండ, మద్దికెర మండలాల్లో సర్వే నెంబర్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీనిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బద్రి, మహ్మద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- వినతులు స్వీకరించిన సబ్ కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఆదోని, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రిసెల్ సిస్టమ్ పీజీఆర్ఎస్) నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులకు సమస్యలను పంపి, గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డీఎల్‌డీవో రమణ రెడ్డి, డీఎల్పీవో నూర్జహాన్, ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫీ, డీటీ వలిబాషా, గుండాల నాయక్ పాల్గొన్నారు.

బడి తెరిచేలోపు పాఠ్యపుస్తకాలు



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రారంభమ య్యేలోపు పాఠ్యపుస్తకాలను అందజేస్తామని ఎంఈవో-2 శ్రీనివాసులు అన్నారు. సోమవారం మునిసిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పాఠ్యపుస్తకాల స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఆదోని నియోజక వర్గంలో 130 ప్రభుత్వ పాఠశాలలుండగా 30వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. వీరి కోసం 85,070 పాఠ్యపుస్తకాలు వచ్చాయ న్నారు. ఇప్పటికే 75శాతం పుస్తకాలు వచ్చాయన్నారు. ఇంకా కన్నడ, ఉర్దూ మీడియానికి చెందిన పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

ఆర్వో ప్లాంట్లను సీజ్ చేయాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్వహిచేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్లను సీజ్ చేయాలని సీపీఎం కార్యదర్శి లక్ష్మన్న డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. మండిగిరి పంచాయతీ పరిధిలో 8 వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి తమకు రాతపూ ర్వకంగా ఇచ్చారన్నారు. ప్లాంట్ల చుట్టుపక్కల భూగర్భ జలాలు ఎండి పోయి ఇళ్లకు నీరు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. పీఎస్ గోపాల్, తిప్పన్న, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

ఆదోని రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17ఏళ్ల బాలిక అదృశ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 8వ తేదిన బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు ఇస్వీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు భూపేష్

ఆలూరు, మే 12(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, కార్మిక నాయకులు భూపేష్, నారాయణస్వా మి పిలుపునిచ్చారు. సోమవారం జ్యోతిబసు భవన్‌లో సమావేశం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ రద్దు డిమాండ్ మేరకు సమ్మెకు ఉద్యోగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలన్నారు. రంగన్న, రామాంజనేయులు, లక్ష్మీకాంత్ రెడ్డి, చాపల గోపాల్, షాకీర్, విఠల్, గోవిందు, తిమ్మప్ప, ఈరన్న పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై చర్యలు

తుగ్గలి, మే 12 (ఆంధ్రజ్యోతి): వాహనాల్లో నిషేధిత వస్తువులు, అక్రమ రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు యజమానికిపై కేసులు నమోదు చేస్తామని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. సోమవారం జొన్నగిరి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై కేసులు నమోదు చేసి, మైనర్లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూ డదని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు.

భూసార పరీక్షతో అధిక దిగుబడులు

దేవనకొండ, మే 12 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధ్యమని ఏఈవో మల్లికా ర్జున సూచించారు. సోమవారం దేవన కొండ రెవెన్యూ పరిధిలోని పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. భూసారం తెలుసుకోకుండా పంటలను సాగుచేస్తే దిగుబడులు రాక నష్టాలబారిన పడే అవకాశం ఉందన్నారు. భూసార పరీక్షతో మట్టిలోని పోషకాలు తెలుస్తాయని, దానికి అనుగుణంగా పంటలను సాగుచేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయండి

మద్దికెర, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ సూచించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ గత సంవత్సర బకాయిలు ఇంకా వసూలు కాలేదని, ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. మేజర్ గ్రామ పంచాయతీ మద్దికెరలో మూడు నాలుగేళ్లుగా ఇంటి పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. జల్‌జీవన్ పథకంలో కొళాయి కనెక్షన్ తీసుకున్నవారు నెలకు రూ.వంద చొప్పున పన్నులు చెల్లించాలన్నారు. సిబ్బంది విజయ్, వలి ఉన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



సూర్యప్రకాశ్ నాయుడు (ఫైల్)

వెల్దుర్తి, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యకర్త బోయ సూర్యప్రకాశ్ నాయుడు (39) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ కన్వీనర్ బలరాంగౌడ్, రమకాంత్‌రెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ సోమవారం భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు.

కౌలు కార్డులు పొందాలి

మద్దికెర, మే 12 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు కార్డులు పొందాలని ఏవో అధికారి రవి కోరారు. సోమవారం హంప గ్రామంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. భూ యజమాని నుంచి కౌలుకు తీసుకున్న రైతులు కార్డు తీసుకుంటే అన్నదాత సుఖీ భవ పథకానికి అర్హులవుతారని తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి కార్డులు పొందాలని సూచించారు. కౌలు ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా బుక్ తీసుకురావాలన్నారు. ఏఈవో భోజరాజు, వీఆర్వో రంగస్వామి, వ్యవసాయ సిబ్బంది అనంతరాజు ఉన్నారు.

ఎస్జీటీలనే హెచ్‌ఎంలుగా నియమించాలి



మాట్లాడుతున్న ఎంసీ సుంకన్న

ఆదోని అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ఎస్జీటీలనే హెచ్‌ఎంలుగా నియమించాలని ఎస్టీయూ అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న డిమాండ్ చేశారు. సోమవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన కార్య కర్తల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్న తులు, బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభ పరిణామన్నారు. హేతుబద్దీకరణలో స్కూల్ అసి స్టెంట్లను హెచ్‌ఎంలుగా నియ మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నామన్నారు. ఇలా చేస్తే ఎస్జీటీలకు అన్యాయం జరుగుతందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు రామాంజినేయులు, చింతకుంట రామకృష్ణ, షేక్షావలి, గణేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.

తాగునీటి కొరత రానివ్వం

- మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా గౌస్



వివరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్

ఆదోని టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రానివ్వమని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా గౌస్ అన్నారు. సోమవారం పంప్ హౌస్‌ను సందర్శించి, పనితీరును పరిశీలిం చారు. ఎల్లెల్సీకి తాగునీరు వచ్చేవరకు బసాపురం, రాంజల చెరువుల్లోని నీటితో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు అధికారులతో చర్చించానన్నారు. పంప్ హౌస్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. పంప్‌హౌస్ నుంచి కొందరు తాగునీటిని అక్రమంగా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఏమాత్రం సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. డీఈ రామమూర్తి ఏఈ జనార్దన్ పాల్గొన్నారు.

కంబాలపాడులో ఆరాధనోత్సవాలు



కంబాలపాడులో పూజలు చేస్తున్న కేఈ జయన్న

క్రిష్ణగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబాలపాడు గ్రామం వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధనత్సవాలు సోమవారం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు వీర బ్రంహ్మేంద్ర స్వామివారికి పూజలు నిర్వహించారు.మాజీ జెడ్పీటీసీ కేఈ జయన్న,కేఈ జయన్న దంపతులు స్వామి వారికి పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం చెక్కబజనల మధ్య స్వామి వారి విగ్రహన్ని గ్రామంలోని వీధులగుండా ఊరేగించారు

సంస్మరణ దినం

ఆదోని టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌకీమఠంలో రాచోటి మహా శివయోగుల 259వ సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. రాచోటి మహా శివ యోగుల సజీవ సమాధికి రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. చౌకీ మఠం మఠ్రి రాచోటి స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వివిధ మఠాల పీఠాధిపతులు మల్లికార్జున మహా స్వామి, మహంత మహా స్వామి, కల్లు మఠంకు చెందిన గురు శిద్దరు స్వామి, ఆజాత శంభులింగ శివాచర్య స్వామి, గిరి మల్లేశ్వరి స్వామి హాజరైన పూజలు నిర్వహించారు. వీరశైవ జంగమ సంక్షేమ నాయకులు ఎండీ బసవరాజ్ స్వామి, వీరభద్ర గౌడ్, సుగూరప్ప, ప్రతాప్, శరణప్ప పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తేనే పంచాయతీల అభివృద్ధి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- జొన్నగిరి కార్యదర్శి నారాయణస్వామి



తుగ్గలి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సక్రమంగా పనులు చెల్లిస్తేనే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని జొన్నగిరి పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి అన్నారు.

ప్రశ్న: సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉనారా?

జవాబు: గ్రామంలోని రెండు సచివాలయాల్లో ప్రతిరోజూ సిబకబంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు.

ప్రశ్న: జనన, మరణ ధ్రువీకరణ సకాలంలో ఇస్తున్నారా?

జవాబు: పుట్టిన 21 దరఖాస్తు చేస్తే రోజుల్లోపు ఆన్‌లైన్ చేసి సర్టిఫికేట్లు ఇస్తున్నాం. 21 రోజులు దాటితే రెవెన్యూ పరిధిలోకి వస్తుంది.

ప్రశ్న: అభివృద్ధి పనుల వివరాలు?

జవాబు: పెండింగ్ సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ కూడా నిర్మిస్తున్నాం. మురుగునీరు పోవడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: తాగునీటి సమస్య ఉందా?

జవాబు: జొన్నగిరిలో గతంలో తాగునీరు లేక ఇబ్బందులు పడేవారు. గత ఏడాది రెండు బోర్లు వేశాం అలాగే జియో మైసూరు కంపెనీ దేశాయ్ తండాలో ట్యాంకు ఏర్పాటు చేయడంతో సమస్య తీరింది.

ప్రశ్న: పన్నులు సకాలంలో వసూలవుతున్నాయా?

జవాబు: పన్ను వసూళ్ల కోసం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి వసూలు చేస్తున్నాం. అయితే పూర్తి స్థాయిలో వసూలు కావడం లేదు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలి.

ప్రశ్న: జియో ట్యాగింగ్ పూర్తి చేశారా?

జవాబు: ఇంటింటికి తిరిగి ఆన్‌లైన్‌లో జియో ట్యాగింగ్ పూర్తి చేశాం. ఇంకా ఏమైనా ఉంటే వాటిని కూడా పూర్తి చేస్తాం.

ప్రశ్న: చెత్త సేకరణ చేస్తున్నారా?

జవాబు: ఇప్పటికే చెత్త బుట్టలు అందించాం. తడి, పొడి చెత్తను వేరు చేసి, బండ్లలో వేయాలని, రోడ్డు లేదా కాలువలో వేయవద్దని సూచించాం.

జూనియర్ లైన్‌మన్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎమ్మిగనూరు టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం తాలుకా పెద్దకడుబూరు మండలం పరిధిలోని నౌనెకల్ గ్రామ గ్రేడ్-2 జూనియర్ లైన్‌మన్ అంజినయ్య సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు, తాలుకా అధ్యక్షుడు గోవిందు, కార్యదర్శి రాముడుల డిమాండ్ చేస్తూవిద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జంతువుల ప్రాణ నష్టానికి లైన్‌మన్‌ను సస్పెండ్ చేయడం అన్యాయం అన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్, ప్రవీణ్, గ్రేడ్2 లైన్‌మెన్ సంఘం నాయకులు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న బాధిత కుటుంబాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు

కౌతాళం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉరుకుంద గ్రామంలో ఈ నెల 6న విద్యుత్ షాక్‌తో మృతి చెందిన యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఏమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నాయకులు, మృతుల కుటుంబీకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏమ్మార్పీఎస్ నాయకులు దుర్గప్ప, మండల అధ్యక్షుడు గుడికంబాలి ఆనంద్‌లు మాట్లాడుతూ ఉరుకుంద గ్రామానికి చెందిన యువకులు సునీల్, మహేంద్రలు జీవనోపాధిలో భాగంగా గ్రామంలోని ఆర్యవైశ్య సేవా సంఘానికి చెందినా ఫంక్షన్ హాల్లో పెళ్లి టెంట్ పనులకు కూలీ పనికి వెళ్లి విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు యువకులు మృతి చెందడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ధర్నా విషయం తెలుసుకున్న కౌతాళం సీఐ అశోక్ కుమార్ అక్కడకు చేరుకుని మృతుల కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తానని ధర్నా విరమించాలని కోరడంతో ఏమ్మార్పీఎస్ నాయకులు ధర్నాను విరమించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఆనంద్ మాజీ మండల అధ్యక్షుడు రాజబాబు, ఉరుకుంద సురేంద్ర, ప్రకాష్, డానియేల్, ఆదాము, వీరేష్, జయప్ప పాల్గొన్నారు.

కూలిన చలువ పందిళ్లు

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం మధ్వమార్గ్ కారిడార్‌లో భక్తులకు చల్లదనాన్ని ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన తాత్కాలిక చలువ పందిళ్లు గాలికి కూలాయి. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీచిన గాలికి మధ్వమార్గ్ కారిడార్‌లో తాత్కాలిక షెడ్లు కూలాయి. దీంతో భక్తులు చలువ పందిల్లో నడిచేందుకు వీలేకుండా ఉండటంతో ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు ఎండ వేడిమికి తట్టుకోలేక భక్తులు పరుగులు పెడుతూ వెళ్లారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

• రాఘవేంద్రరెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామప్రజలు



ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న టీడీపీ నాయకులు

కోసిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దభోంపల్లి గ్రామంలో వారం రోజుల నుంచి తాగునీటిఎద్దడి ఏర్పడటంతో టీడీపీ గ్రామ నాయకులు జనార్దన్, హనుమంతు, శ్రీరాములు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సొంత నిధులతో తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు అందించారనీ, దీంతో రాఘవేంద్రరెడ్డికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో వేసవి కాలంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో గ్రామ పంచాయతీ అధికారులు తాగునీరు సక్రమంగా అందించడం లేదని సమస్య తెలిపిన వెంటనే మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి తాగునీటి ట్యాంకులు ఏర్పాటుచేశారని, వారికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వర్మీ కంపోస్టుతో ఆదాయం

గోనెగండ్ల, మే 12(ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు ద్వార సిబ్బంది తమ పంచాయతీకి ఆదాయం తీసుకురావాలని గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ కోరారు. సోమవారం చెత్తనుంచి సంపద కేంద్రలో తయారు చేసిన వర్మికంపోస్టును వారు పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి రథోత్సవం

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన బాట మారెమ్మ దేవత (విజయ దుర్గాదేవి) రథోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం సాయంత్రం ఈడిగ గోవిందు ఆధ్వర్యంలో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, విజయరామిరెడ్డి, రామయ్య, మజ్జిగ బొజ్జప్ప, రోగెప్ప, పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు



దర్శించుకుంటున్న డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం, మే 12 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన కౌతాళం జగద్గురు ఖాదర్ లింగ స్వామి ఉరుసు ఉత్సవాలలో భాగంగా మంగళవారం జియారత్(ప్రసాదాల పంపిణీ) కార్యక్రమంను దర్గా పీఠాధిపతి పెద్ద మున్నాపాష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఉరుకుంద ఈరన్న ఆలయ ఈవో మేడిపల్లి విజయరాజు సందర్శించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ ఉన్నారు.

పత్తి సాగులో అన్నదాత నిమగ్నం

- ఈ ఏడాది జిల్లాలో పెరగనున్న పత్తిసాగు..
- అదునులో సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం
- ముందస్తు సాగుతో నష్టాలు తప్పవు
- జూన్ రెండోవారం కల్లా సాగు పూర్తి చేయాలి

ఎమ్మిగనూరు రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లులు కురిశాయంటే చాలు. రైతన్నల ఆశలకు చిగురులు మొలుస్తాయి.. ఎప్పుడెప్పుడు దుక్కిదున్నాలా.. ఎప్పుడెప్పుడు సాగు చేయాలా అని ఆలోచిస్తుంటారు. ఇలా ఎన్నో ఆశలతో పంటలను సాగుచేసే రైతన్నలకు ప్రకృతి విపత్తుల కారణంగానో.. చీడ పురుగుల కారణంగానో రైతులు ప్రతియేటా నష్టాల పాలవుతునే ఉంటారు.య తొలకరి జల్లులు కురిసిన వెంటనే జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తి పంటను సాగుచేసేందుకే ఎక్కువగా మొగ్గుచూపుతారు. అయితే సాగుచేసే ముందు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచి దిగుబడులను సాధించవచ్చని ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు.

ముందుగా సాగుచేస్తే నష్టం తప్పదు

చాలా మంది రైతులు పత్తి పంటను అదును(సాగు సమయం కాకముందే) కాకముందే సాగుచేస్తారు. ఇలా చేయడం వల్ల పత్తిపంటకు గులాబీ రంగు పురుగు సోకి పంట పూర్తిగా నాశనమయ్యే ప్రమాదం ఉంది. పత్తిపంటను చాలా మంది రైతులు మే మొదటి, రెండవ వారాల్లో సాగుచేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఒక్కోసారి మొలకలు మొలవక పంటపూర్తిగా నాశనం అవుతుంది. అలా జరగకుండ ఉండాలంటే ప్రతి రైతు జూన్ మొదటి వారంలో పత్తిపంటను సాగు చేయాలి. జులై రెండవ వారానికంతా పత్తి సాగును పూర్తి చేసుకోవాలి. కొంత మంది రైతులు ముందుగా పంటను సాగుచేసి మరలా వచ్చే పంటకు ముందస్తుగా భూమిని సాగు చేస్తారు. ఇలా చేస్తే రైతులకు నష్టాలు తప్పవని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అలాగే జులై రెండవ వారానికంతా పత్తిపంట సాగును పూర్తిచేస్తే మంచిదని తెలుపుతున్నారు.

పత్తి పంట సాగు విధానం

పత్తి పంటను సాగుచేసే విధానంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నల్లరేగడి నేలలో అయితే 70 మీ.మీ వర్షాపాతం నమోదు కావాలి. ఎర్రనేలలో అయితే 50 నుంచి 60మీ.మీ వర్షాపాతం నమోదు కావాలి. దీంతో భూమిలో ఉన్న వేడిశాతం తగ్గి మొలకలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. అలా కాకుండ తక్కువ వర్షపాతం నమోదైన అయిన సమయంలో పంటను సాగుచేస్తే మొలకలు అక్కడక్కడ రావడమేగాక ఒక్కోసారి అసలే



సిరాలదొడ్డి గ్రామ సమీపంలో బోరుకింద సాగుచేసిన పత్తిపంట

మొలకలు వచ్చే అవకాశం ఉండదు. అలాగే పంటను సాగుచేసే సమయంలో ఎకరాకు బాదెలకు మధ్య ఎకరాకు (సాలకు) మామూళ్ల పద్దత్తిలో అయినా నాలుగు అడుగుల దూరం ఉండాలి. మొక్కకు మొక్కకు మధ్య 30 సెం.మీ ఉండాలి. అలాగే అధిక సాంద్రతా విధానంలో అయితే నల్లరేగడి నేలల్లో బాదెకు బాదెకు మధ (సాలకు సాలు మధ్య) 3 అడుగుల దూరంతో పాటు, మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగుల దూరం ఉండాలి. ఎర్రనేలల్లో అయితే బాదెకు బాదెకు మధ్య మూడు అడుగులు, మొక్కకు మొక్కకు మధ్య ఒక అడుగు దూరం ఉండాలి. సాధారణ పద్ధతిలో సాగు చేస్తే ఎకరాకు దాదాపు రెండున్నర నుంచి మూడు ప్యాకెట్ల విత్తనాలు సరిపోతాయి. అధిక సాంద్రతా విధానంలో సాగు చేసే సమయంలో నల్లరేగడి నేలల్లో అయితే ఎకరాకు నాలుగు ప్యాకెట్ల పత్తి విత్తనాలు సరిపోతాయి. అలాగే ఎర్రనేలల్లో అయితే ఎకరాకు 6 ప్యాకెట్లు సరిపోతాయి. బోరుకింద పంటలను సాగుచేసే రైతులు మే రెండవ వారం నుంచి కూడా సాగు చేయవచ్చు. ఆగష్టులో సాగుచేసే పంటకు అధికంగా గులాబి రంగు పురుగుతో పాటు గొగ్గిపత్తి కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంది. పత్తి పంట మొత్తానికి ఎకరాకు 108 కి.లో యూరియా, 50 డీఏపీ, 40 కి.లో పొటాష్ వేసుకోవాలి. దీన్ని కూడా విడతల వారిగా వినియోగించుకోవాల్సి ఉంటుంది. పంటను సాగుచేసిన 48గంటల్లోపే ఒక ఎకరాకు ఒక లీటరు కలుపు మందును కూడా వాడొచ్చు.

పెరగనున్న పత్తిసాగు

జిల్లాలో ఈ ఏడాది గడచిన సంవత్సరం కంటే ఎక్కువగా సాగుచేసే అవకాశం ఉంది. ఇందుకు ప్రధాన కారణంగా చివరి సంవత్సరంలో పత్తిపంటకు మంచి గిట్టుబాటు ధర ఉండడమేగాక పంట కూడా దిగుబడి అధికంగా వచ్చింది. దీంతో జిల్లాలో ఈ ఏడాది అధికంగా రైతులు పత్తిపంటను సాగుచేసే అవకాశం ఉంది. జిల్లాలో 2.43లక్షల హెక్టార్లలో పత్తిపంటను రైతులు సాగుచేసేందుకు అవకాశం ఉంది. అయితే చివరి ఏడాది 1.98వేల హెక్టార్లలో రైతులు పత్తిపంటను సాగుచేశారు. ఈ ఏడాది పత్తి విస్తీర్ణం దాదాపు 2లక్షలకు పైగా సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలుపుతున్నారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి



రైతులు పత్తిపంటను తొందర పడి సాగుచేయరాదు. ప్రతియేటా రైతులు తొందరపాటు సాగు లేదా ఆలస్యంగా సాగుచేయడం వల్లనే నష్టాలను అధికంగా చూస్తున్నారు. పంటలను సాగుచేసే సమయంలో వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిం చాలి. పంలను సాగుచేసే సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో తమను సంప్రదించవచ్చు. అన్ని వేళలా తాము రైతులకు అందుబాటులో ఉంటాము.

రాఘవేంద్ర చౌదరి, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం, ఎమ్మిగనూరు

ఘనంగా మృత్యుంజయ హోమం

• పాల్గొన్న సినీ నటులు



పీఠాధిపతికి నమస్కరిస్తున్న సినీ నటులు ఉపేంద్ర, తార

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు మృత్యుంజయ, ఆయుష్య, మార్కెండేయ హోమాలు శోభాయానుమానంగా నిర్వహించారు. సోమవారం శ్రీమఠం యాగశాలలో మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి విశేష పూజలు నిర్వహించి మూల రాములకు పూజలు చేశారు. అనంతరం హోమ పూజల్లో దూపదీప నైవేద్యాలు, సుగంధ ద్రవ్యాలు వేస్తూ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి పూర్ణాహుతి చేశారు. ప్రముఖ సినీ నటుడు, కర్ణాటక రాష్ట్ర ప్రజాకీయ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర, ప్రముఖ సినీ నటి తార, వాధిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్, మఠం దివాన్ శ్రీనాధాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి, రవికులకర్ణి, శ్రీపాదాచార్, ఏఈ బద్రినాథ్, ఎస్టేట్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుట్టా నీలకంఠను అడ్డుకున్న రుద్రగౌడ్ వర్గీయులు

ఎమ్మిగనూరు , మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్లు గ్రామంలో జరిగే అల్లిపీరస్వామి మహోత్సవంలో వైసీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టారేణుక భర్తకు చుక్కెదురైంది. బుట్టారేణుక భర్త బుట్టా నీలకంఠ ఆదివారం సాయంత్రం వైసీపీ రాష్ట్ర వీరశైవ లింగాయత్ మాజీ చైర్మన్ వై. రుద్రగౌడు స్వగ్రామమైన గుడికల్లు గ్రామంలో అల్లిపీరస్వామి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా దర్గాలోని స్వామిని దర్శించుకునేందుకు స్థానిక వైసీపీ నాయకులతో కలిసి వెళ్లారు. అయితే విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కుమారుడు నాగేష్‌తో పాటు మరికొంతమంది బుట్టా నీలకంఠను నిలదీశారు. తమ గ్రామానికి ముఖ్య నాయకుడైన రాష్ట్ర వీరశైవలింగాయత్ మాజీ చైర్మన్ వై.రుద్రగౌడుకు సమాచారం లేకుండానే మీరు ఎలా వస్తారంటూ నిలదీశారు. వెంటనే స్థానికంగా ఉన్న కొంత మంది రుద్రగౌడుకు సమాచారం అందజేయడంతో ఆయన వాళ్ల వర్గీయులకు ఫోన్ చేసి ఆందోళన చేయవద్దని.. వాళ్లను అడ్డుకోవద్దని నచ్చజెప్పడంతో శాంతించి వెళ్లిపోయారు. అనంతరం బుట్టా నీలకంఠతో పాటు వైసీపీ నాయకులు దర్గాలో స్వామిని దర్శించుకొని వెళ్లారు. కాగా వైసీపీలో వర్గా విబేధాలు మరో సారి తేటతెల్లడం కావడంతో కార్యకర్తలు విస్మయానికి గురవుతున్నారు.

'బాలింతలకు సాయం చేయడంలో విఫలం'

నందవరం, మే 12(ఆంధ్రజ్యోతి): బాలింతలకు ఆర్థిక సహాయం అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి అన్నారు. ముగతిలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన బాలింతలకు తక్షణ ఆర్థిక సాయం అందించడం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఆసరా పథకం కింద తక్షణమే రూ. 5000 బ్యాంక్ ఖాతాలో జమ చేసి వారికి ఎంతో ఆసరాగా నిలబడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యాక్షుడు ముగతి రాఘవరెడ్డి, తారకరాముడు, హుసేని, రాజు మల్లికార్జున, భీముడు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి) : విద్యను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకొవాల్సిన బాధ్యత విద్యార్థి సంఘాలపై ఉందని పీడీఎస్‌యూ నూతన తాలుకా అధ్యక్షుడు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడిగా సర్వన్న, ప్రధాన కార్యదర్శిగా అలీ నరసింహలను ఎన్ను కున్నారు. కార్యక్రమంలో విష్ణు శ్రీరామ్, ఆది, వెంకట్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కోసిగి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలో ఊరు దేవునిగా పిలువబడే కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) రథోత్సవం సందర్భంగా కోసిగికి చెందిన హరికృప కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తేరుబజారు మైదానంలో ఆంజనేయస్వామికి గ్రామ పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు నాడిగేని నరసింహులు, ముత్తురెడ్డి, మురళీధర , నాడిగేని తాయన్న, నాడిగేని అయ్యన్న, తోవి రామకృష్ణ, హోళగుంద కోసిగయ్య, గుండాల ఈరయ్య, నాడిగేని ఈరెడ్డి, గవిగట్టు ఈరయ్య ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా పీఠాధిపతి 13వ పట్టాభిషేక మహోత్సవం



పీఠాధిపతికి నాణేలు, పండ్లతో తులాభారం వేస్తున్న దృశ్యం

మంత్రాలయం, మే 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మఠం పీఠాన్ని అధిష్టించిన 13వ పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి శ్రీమఠంలోని యాగశాలలో ప్రత్యేక వేదికపై ఒక వైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, బెంగళూరు చెందిన ఉత్తర్ ఇండియా శ్రీమఠం విచారణకర్త శ్రీనివాస్ ఖస్బే పండ్లతో తులాభారం చేశారు. అదే విదంగా మఠం ఎంప్లాయిస్ అసోసియేషన్ సిబ్బంది నాణేలతో తులాభారం చేశారు. దీంతో పీఠాధిపతి జయహో గురురాజ విజయహో అంటూ భక్తులు జయధ్వానాలు పలికారు. అనంతరం సంస్కృత పాఠశాల విద్యార్థులు, మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, టీడీపీ మంత్రాలయం కన్వీనర్ పన్నగ వెంకటేశ్, దుకాణాలు, లాడ్జీల యజమానులు పూలతో గజమాలలు వేసి పూల వర్షం కురిపించి శాలువలతో ఘనంగా సత్కరించారు. పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, రాజా ఎస్ అప్రమేయాచార్, రాజా ఎస్ వాదేంద్రచార్, గౌతమాచార్, సుజీంద్రచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, రవికులకర్ణి, డీఎం ఆనందరావు, ఏఈ బద్రినాథ్, అనంతపురాణిక్, విజయేంద్రాచార్, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జేపీ స్వామి, కురువ మల్లికార్జున, గోరుకల్లు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జయంతి ఉత్సవాలు

పెద్దకడుబూరు, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరిధిలోని దొడ్డిమేకల, మురవణి గ్రామాల్లోని ఆంజనేయ స్వామి ప్రధాన అర్చకులు రామ్మూర్తి, నరసింహ మూర్తి ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆంజినేయ స్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కీర్తించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు శివరామిరెడ్డి, సత్యారెడ్డి, తెలుగు మధు, మందుల వీరేష్, నాగేంద్ర, బద్రి, రామాంజినేయుడు, ఈరయ్య, వీరేష్, గోవిందు పాల్గొన్నారు.

'ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): అడ్మీషన్ల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు విష్ణు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుమంత్, నరసింహ నాయుడు, శీను పాల్గొన్నారు.

మృతదేహంతో ధర్నా



పెట్రోల్ బంకు వద్ద మృతదేహంతో ధర్నా చేస్తున్న బంధువులు

ఎమ్మిగనూరు, మే12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న క్యాదరి రాజు(32) విధుల్లో ఉండగా కిందపడి చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని మృతదేహంతో పెట్రోల్ బంకులో బంధువులు ధర్నాకు దిగారు. వీరికి సీపీఐ, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఆర్థిక సాయం అందించేందకు యాజమాన్యం నిరాకరించటంతో ఆగ్రహానికి గురైన బంధువులు క్యాదరి రాజు మృతదేహాన్ని ఎంజీ పెట్రోల్ బంకుకు తరలించి ఎనిమిది నెలల గర్భిని భార్య మంజుల, మూడేళ్ల కుమారుడు మోహన్‌తో కలిసి ధర్నాకు దిగారు. వీరికి మద్దతుగా సీపీఐ పట్టన కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకులు భాస్కర్ యాదవ్‌లతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, శేఖర్, మాలమహానాడు నాయకులు మధుబాబు, ఏఐవైఎఫ్ నాయకులు రాజీవ్‌లు ఆందోళనలో పాల్గొన్నారు. యాజమాన్యం రూ. 4లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకోవటంతో ఆందోళనను విరమించారు. అటు తర్వాత అంత్యక్రియలు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయసంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి: ఏఐకేఎంఎస్

పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో కె రాజు అనే వ్యక్తి 15 సంవత్సరాలుగా పని చేస్తూ అక్కడే కళ్ళు తిరిగి పడిపోవడంతో చికిత్స అందించినా మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచాడని, సదరు కార్మికుడికి ఉద్యోగ భద్రత కింద రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐలు ఏవీ లేకోపావడం అ కుటుంబాన్ని ఆర్థికంగా కుంగదిసిందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బాలరాజు అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా సత్యన్న, ఐఎఫ్‌టీయూ పట్టణ కార్యదర్శి బాబు, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ సెంటర్‌కు నిధులు విడుదల చేయాలి



మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో క్రిటికల్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కోరారు. సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి రాజధాని అమరావతిలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా గతంలో తన విజ్ఞప్తిమేరకు ప్రభుత్వం క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరు చేసిందని, అయితే ఇంతవరకు నిధులు మంజూరు కాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ నిధులు మంజూరు అయ్యేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈనెల 21న పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో కొత్తగా నిర్మించిన వందపడకల ఆసుపత్రి ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యే మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆహ్వానించారు.

వీరజవాన్లకు టీడీపీ నాయకుల నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్లకు టీడీపీ నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సోమవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ చేశారు. వీరజవాన్లను కీర్తిస్తూ నినాదాలు చేశారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండయ్య చౌదరి, కౌన్సిలర్ రామదాసుగౌడ్, నాయకులు నరసింహులు, శివకుమార్, జయన్న, రంగన్న, ఉరుకుందు, గోపాల్, పరమేష్, మల్లయ్య, రాజేంద్ర, మహేష్, టౌన్‌బ్యాంకు ఉపాధ్యక్షుడు నరసప్ప, రంగన్న, రామకృష్ణ, అంజి, శాంతిరాజు, కృష్ణ, వెంకటేశ్వర రెడ్డి, మహేష్, అంబేడ్కర్ పాల్గొన్నారు.

రమణీయం.. ఆంజనేయస్వామి రథోత్సవం



చిన్నకడుబూరులో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దకడుబూరు, మే12 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిన్నకడుబూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారు జాము నుంచే స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ రైతు సంఘం అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి, మల్లికార్జున, మీసేవా ఆంజనేయులు, ఎంజీ నరసన్న, రామాంజనేయుల, పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో వెలసిన సద్గురు అల్లిపీరస్వామి గంధ మహోత్సవాన్ని పీఠాధిపతి సయ్యద్ ఘాజీ హుసేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని స్వామివారి ఇంటి నుంచి గంధాన్ని తీసుకువచ్చి దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. స్వామివారి గంధం, ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకుని దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు దాదాపు 20వేల మంది భక్తులు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రా, మహారాష్ట్ర నుంచి తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.